అక్టోబర్ 13,14,15 తేదీల్లో అనంతలో ఐద్వా రాష్ట్ర మహాసభ 3

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 342 | విజయవాడ, ఆదివారం 13 జులై 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday13 July 2025 | Rs



చరిత్ర సృష్టించిన స్వైటెక్

- వింబుల్డన్ ఫైనల్లో పాయింట్ కోల్పోకుండా టైటిల్ కైవసం

8


బనకచర్లకు ఏదీ మార్గం?

కేంద్రం తొండాట నేపథ్యంలో అధికారవర్గాల్లో చర్చ

సిఎం పర్యటనలో ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న తొండాట అధికారవర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఒకవైపు రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉందని చెబుతూనే మరోవైపు తన ఆధీనంలోని వివిధ ఏజెన్సీలతో కేంద్రం పదేపదే కొర్రీలు వేయించడంపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు సమర్థత, దాని వల్ల లాభనష్టాల విషయం ఎలా ఉన్నప్పటికీ, తామ భాగస్వామి ప్రభుత్వంతో కేంద్రం ఇలా వ్యవహరించడం గతంలో ఎన్నడూ లేదని సీనియర్ అధికారులు అంటున్నారు. ముందు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, ప్రత్యేకహోదాతో పాటు విభజన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సిపిఎంతో పాటు వామపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశాలనేవి పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు గత ఏడాది కాలంగా బనకచర్ల ప్రాజెక్టుపై విస్తృత ప్రచారం చేస్తున్నా, అనూహ్యంగా కేంద్ర ప్రభుత్వం నుండి వరుసగా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కొద్దిరోజుల క్రితం కేంద్ర పర్యావరణ శాఖ అభ్యంతరాలు పెట్టగా, తాజాగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ డైరెక్టర్ మన్ను జి ఉపాధ్యాయ రాసిన లేఖలోని అంశాలపై అధికారుల్లో ఆసక్తి కర చర్చ సాగుతోంది. కేంద్ర ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా ఇటువంటి లేఖలు, అభ్యంతరాలు వ్యక్తం కావని అంటున్నారు. దీంతో ఈ నెల 15, 16 తేదీలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జరపనున్న ఢిల్లీ పర్యటనలో ఈ ప్రాజెక్టు అంశమే కీలకం కానుందని సమాచారం. పోలవరం రెండవ దశ పూర్తయితేనే బనకచర్లను చేపట్టాల్సిఉంటుందన్న పాజెక్టు అథారిటీ వాదన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఇప్పటికే వినిపిస్తున్న వరద జలాల వాదనను మరింత గట్టిగా వినిపించే అవకాశం ఉందని, దానికి సంబంధించిన గణాంకాలను అందించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ వాదనను పరిగణలోకి తీసుకుంటే రెండవ దశ దాకా ఆగవలసిన అవసరం లేదని అంటున్నారు. ఆ మేరకు కేంద్రానికి అందించడానికి వీలుగా పూర్తి వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అదే సమయంలో ప్రత్యామ్నాయాలపైన కసరత్తు చేస్తున్నారు.



అథారిటీ ఏం చెప్పింది?

'బనకచర్ల ప్రాజెక్టును చేపట్టాలంటే పోలవరం డిపిఆర్‌ను మార్చాలి. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం 41.14 మీటర్ల ఎత్తుకే (మొదటి దశ) నీటిని నిలువ చేసేలా అనుమతులు ఇచ్చింది. దీనిని 45.72 మీటర్ల ఎత్తుకు (రెండవ దశ) పెంచిన తరువాతే బనకచర్లకు నీటినితరలించాలి. ఆ మేరకు డిపిఆర్‌లో మార్పులు చేయాలి' అని పోలవరం మిగతా 7లో

క్యూబా అధ్యక్షుడిపై అమెరికా ఆంక్షలు

- ఇటువంటి చర్యలతో మా సంకల్పాన్ని దెబ్బతీయలేరన్న క్యూబా

వాషింగ్టన్ : క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్‌పై మొదటిసారిగా అమెరికా ఆంక్షలు విధించింది. క్యూబన్ల పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న క్రూరత్వంలో అధ్యక్షుడు పోషించిన పాత్రకు గానూ ఈ ఆంక్షలు విధించినట్లు శుక్రవారం పేర్కొంది. క్యూబా అధ్యక్షుడికి, ఇతర ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులకు వీసా ఆంక్షలను అమెరికా విదేశాంగ శాఖ జారీ చేసింది. ఈమేరకు అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ఎక్స్‌లో పోస్టు పెట్టారు. క్యూబాలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు జరిగి నాలుగేళ్లు కావస్తున్న సందర్భంగా ఆయన ఈ పోస్టు పెట్టారు. ఆంక్షలు ఎదుర్కొంటున్న వారిలో క్యూబా రక్షణ మంత్రి అల్వారో లోపెజ్ మిరా, హోం మంత్రి లాజారో అల్బర్టో అల్వారెజ్ వున్నారు. క్యూబా ప్రభుత్వానికి మద్దతుగా అమెరికా డాలర్ల రూపంలో నిధులు అందకుండా చేసేందుకు హవానాలోని 42 అంతస్తుల హోటల్ 'టోరో కె'ను కూడా అమెరికా తమ ఆంక్షల సంస్థల జాబితాలో చేర్చింది. కాగా తాజా చర్యలను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలతో క్యూబా ప్రజల, నేతల సంకల్పాన్ని ట్రంప్ ప్రభుత్వం దెబ్బతీయలేదని వ్యాఖ్యానించారు. ఈ హోటల్ ఇటీవల హవానాలో సెంట్రల్ ఏరియా హోటల్‌ను ప్రారంభించింది. దానిపై అమెరికా తీవ్రంగా మండిపడింది. పర్యాటక రంగం క్షీణిస్తున్న సమయంలో కొత్త హోటళ్ళపై క్యూబా ప్రభుత్వం ఇంత పెద్దమొత్తంలో పెట్టుబడుల పెట్టడాన్ని తీవ్రంగా విమర్శించింది. ఒకపక్క క్యూబన్లు ఆహారం, నీరు, మందులు, విద్యుత్ వంటి కొరతలతో ఇబ్బందులు పడుతుంటే మరోపక్క ప్రభుత్వం డబ్బును ఇలా పెద్ద మొత్తంలో ఖర్చు పెడుతోందని రూబియో విమర్శించారు.



సీలేరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాభిప్రాయ సేకరణ చేయండి

- లేకుంటే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుపై ప్రజా తిరుగుబాటు తప్పదు
- అల్లూరి జిల్లా పర్యటనలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పూర్తి స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి ప్రజల సమ్మతి పొందిన తరువాత మాత్రమే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం, డొంకరాయి, సీలేరు ప్రాంతాల్లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి బూషికొండ, శాండికోరి, సీలేరు పంచాయతీ పరిధి పార్వతీనగర్ ప్రాంతాల్లో నిర్మించనున్న పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులుగా మారనున్న ఆ మూడు గ్రామాల ప్రజలతో వి.శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు సమావేశమయ్యారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు వల్ల వారికి జరుగుతున్న నష్టంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామాల్లో పూర్తి స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ప్రాజెక్టు నిర్మాణానికి ఎపి జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారని ఆ గ్రామాల ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనికి వి.శ్రీనివాసరావు స్పందిస్తూ, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సీలేరు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీలేరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 1,350 మెగావాట్ల సామర్థ్యంతో నెలకొల్పుతున్న పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంపై గిరిజనుల్లో ఆందోళనలు నెలకొన్నాయని, వాటిని పూర్తి స్థాయిలో నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వ్యవసాయ భూముల గుండా అండర్ గ్రౌండ్‌లో పైపులైన్ వస్తుందని, దీనివల్ల తాము ఉపాధి కోల్పోతామని గిరిజన మిగతా 7లో

ఇంధన స్విచ్‌లు ఆగిపోయాయి

- సరఫరా నిలిచిపోయింది
- అహ్మదాబాద్ విమానం దుర్ఘటనపై ఎఎఐబి ప్రాథమిక నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇంధన స్విచ్‌లు ఆగిపోవడంతోనే అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిందని ఈ ప్రమాదంపై నిర్వహించిన ప్రాథమిక నివేదిక స్పష్టం చేసింది. ఈ దుర్ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఎఎఐబి) ప్రాథమిక నివేదికను శనివారం విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో పలు కీలక విషయాలు వెల్లడించింది. 'విమానం టేకాఫ్ అయిన సెకను వ్యవధిలోనే రెండు ఇంధన కటాఫ్ స్విచ్‌లు ఆఫ్ అయ్యాయి. దీంతో రెండు ఇంజిన్లు గాలిలోనే ఆగిపోయాయి. రెండు స్విచ్‌లు ఒకేసారి ఆఫ్ అవడంతో ఇంధన సరఫరా నిలిచిపోయింది. ఫ్యూయల్ కట్‌ఆఫ్ స్విచ్‌లు.. రన్ నుంచి కటాఫ్ మోడ్‌లోకి వెళ్లిపోయాయి. అది కేవలం సెకన్‌లోనే జరిగింది. దీంతో ఇంజిన్లు గాలిలోనే నియంత్రణ కోల్పోయాయి' అని ఎఎఐబి నివేదిక పేర్కొంది. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను పూర్తిగా పరిశీలించామని, అలాగే, విమానానికి సంబంధించి రెండు ఇంజిన్లను వెలికితీసి, భద్రపరిచినట్లు పేర్కొంది.

ప్రమాదానికి ముందు విమానంలో ఫ్యూయెల్, బరువు సైతం పరిమితుల్లోనే ఉన్నాయని తెలిపింది. అలాగే, విమానంలో ప్రమాదకరమైన వస్తువులు ఏవీ లేవని వెల్లడించింది. రెండు ఇంజిన్లు ఒకేసారి ఆగిపోవడంతో విమాన ప్రయాణ వేగం, ఎత్తులో శ్రీఘ్ర మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపింది. అలాగే, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని, విమానంపై దాడి జరిగినట్లు చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది.

కాక్‌పిట్ ఆడియో సంభాషణల ప్రకారం ఇంధన స్విచ్‌ను ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్ మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఎటిసి) స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిందని పేర్కొంది. విమానం కేవలం 32 సెకన్లు మాత్రమే గాలిలో ఎగిరింది. రన్‌వేకు 0.9 ఎన్ఎం దూరంలో విమానం కూలి ఓ హాస్టల్‌పై పడింది. ఈ ప్రమాదానికి పక్షి ఢీకొట్టడం కానీ.. వాతావరణ సంబంధిత సమస్యలు కారణం కాదని నివేదిక తెలిపింది.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు బహుకరిస్తున్న సిజెఐ

న్యాయవాద వృత్తిలో ఎన్నో సవాళ్లు

- కోర్టుల తీర్పులపై సమగ్ర అవగాహన అవసరం
- జస్టిస్ బిఆర్ గవాయ్

7

డిగ్రీ అడ్మిషన్లను వెంటనే చేపట్టాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

2

బెంగాల్‌లో మరో దారుణం..

- ఐఐఎం కొల్‌కతా విద్యార్థినిపై క్యాంపస్‌లోనే అత్యాచారం
- నిందితుడు అరెస్టు

కొల్‌కతా : తృణమూల్ కాంగ్రెస్ పాలనలోని పశ్చిమబెంగాల్‌లో మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత నెలలో న్యాయ విద్యార్థినిపై అత్యచార ఘటన మరువక ముందే.. తాజాగా మరో దారుణం జరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- కొల్‌కతాలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థినిపై క్యాంపస్‌లోనే అత్యాచారం జరిగింది. తోటి విద్యార్థినే ఈ అత్యాచారానికి పాల్పడ్డాడు. క్యాంపస్‌లోని బాయ్స్ హాస్టల్‌లో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. గత కొంతకాలంగా మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థినికి కౌన్సెలింగ్ ఇస్తానని చెప్పి అదే కళాశాలలో చదువుతున్న విద్యార్థి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలిని శుక్రవారం సాయంత్రం బాయ్స్ హాస్టల్‌కు పిలిపించుకుని అక్కడ ఆమెకు మత్తుమందు కలిపిన జ్యూస్ ఇచ్చి అత్యాచ్చారానికి పాల్పడ్డాడు. ఆమె స్పృహలోకి వచ్చాక తనపై అత్యాచారం జరిగిన విషయాన్ని గ్రహించి. ఈ విషయంపై అతడిని ప్రశ్నించగా.. అత్యాచారం గురించి ఎవరికైనా చెప్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదు మేరకు హరిదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదయింది. అఘాయిత్యానికి పాల్పడిన విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు నిందితుడికి ఈ నెల 19 వరకూ పోలీస్ కస్టడీ విధించింది. బెంగాల్‌లో మహిళలపై వరుస అత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. నెల రోజుల క్రితం సౌత్ కొల్‌కతా లా కాలేజీ ప్రాంగణంలో 24 ఏళ్ల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం, భౌతిక దాడి ఘటన మరిచిపోకముందే తాజా ఘటన జరిగింది. లా విద్యార్థినిపై టిఎంసి విద్యార్థి సంఘం నాయకులే దారుణానికి పాల్పడ్డం మరింత దిగ్భ్రాంతి కలిగించింది. అంతకుముందు 2024 ఆగస్టు 9న కొల్‌కతాలోని ఆర్‌జికర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది.

రాష్ట్రంలో అత్యాచార ఘటనలపై అధికార టిఎంసిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఉదాసీనత, నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

'తుంగభద్ర'లో ముగ్గురు యువకుల గల్లంతు

ప్రజాశక్తి - మంత్రాలయం (కర్నూలు జిల్లా)

తుంగభద్ర నదిలో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. ఈ సంఘటన కర్నూలు జిల్లాలోని మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ జిల్లాకు చెందిన ఏడుగురు యువకులు అజిత్, ప్రమోద్, సచిన్, రంగనాథ్, నారాయణ, దర్శన్, హేమంత్ కలిసి రాఘవేంద్రస్వామి దర్శనార్థం శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలో అజిత్, ప్రమోద్, సచిన్, రంగనాథ్ దిగారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నది లోపలికి కొట్టుకుపోయారు. స్థానికులు గమనించి రంగనాథ్‌ను ఒడ్డుకు చేర్చారు. అజిత్, ప్రమోద్, సచిన్ నీటి ప్రవాహానికి గల్లంతయ్యారు. ఈ యువకులంతా డిగ్రీ చదువుతున్నారు. శ్రీమఠం మేనేజర్లు ఎస్‌కె శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ మూర్తి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

'వర్సిటీ'ల్లో బోధకులేరి?

- 3,480 ఖాళీ పోస్టులు
- కోర్టుల్లో కేసులు
- ఏళ్ల తరబడి పెండింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణంగా ఉంది. ఉన్నత విద్య, పరిశోధన కేంద్రాలుగా ఉండాల్సిన యూనివర్సిటీలు ఒకపక్క నిధుల కొరతతోనూ, మరోపక్క సిబ్బంది కొరతతోనూ కొట్టుమిట్టాడుతున్నాయి. అధ్యాపక పోస్టులను భర్తీ చేయకపోవడంతో రూసా, యుజిసి నుంచి నిధులు రావడం లేదు. నియామక ప్రక్రియకు ఇస్తున్న నోటిఫికేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం నియమ, నిబంధనలు పాటించకపోవడం వల్ల కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇలానే సాగడంతో ఒక తరం విద్యార్థులు నష్టపోయారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 యూనివర్సిటీల్లో సుమారు 3,480 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 9 యూనివర్సిటీలకు వైస్ ఛాన్స్‌లర్లు కూడా లేరు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ పోస్టుల భర్తీ ఆయా యూనివర్సిటీల పరిధిలో జరిగాయి. చివరిసారిగా 2008లో ఈ నియామకాల ప్రక్రియ నిలిచిపోయింది. విశ్వవిద్యాలయాలు సొంతంగా చేసుకుంటున్న ఈ నియామకాల్లో భారీ అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వచ్చాయి. రాష్ట్ర విభజన అయిన తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం నియామక ప్రక్రియను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి)కి 2018లో అప్పగించింది. మొత్తం 14 యూనివర్సిటీల్లో 2,400 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి స్క్రీనింగ్ టెస్ట్‌ను ఎపిపిఎస్‌సి నిర్వహించింది. ఈ పరీక్షలో అభ్యర్థులను ఎంపిక చేసింది. కానీ ఇందులో రోస్టర్ విధానం పాటించలేదని కొంతమంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. రోస్టర్ విధానం పాటించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో టిడిపి ప్రభుత్వంలో నియామక ప్రక్రియ సుప్రీంకోర్టు వద్ద పెండింగ్‌లో ఉంది. దీనిని పట్టించుకోకుండా వైసిపి ప్రభుత్వం 2023లో మరోసారి 3,220 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌లో కూడా రోస్టర్ విధానం పాటించలేదని కొంతమంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ నియామక ప్రక్రియ కూడా హైకోర్టు పరిధిలో పెండింగ్ ఉంది. ఈ పెండింగ్ కేసులు ఎప్పుడు పూర్తవుతాయో? నియామకాలు ఎప్పుడు జరుగుతాయో? తెలియని పరిస్థితి నెలకొంది. బోధనా సిబ్బంది లేకపోవడంతో పరిశోధనల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు రూసా నుంచి విశ్వవిద్యాలయాలకు రావాల్సిన గ్రాంటులు రాకపోవడంతో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, గెస్ట్ సిబ్బందికి యూనివర్సిటీలే వేతనాలు చెల్లిస్తున్నాయి. ఇందుకోసం అన్ని యూనివర్సిటీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు పెరిగాయి. బోధనా సిబ్బంది నియామక ప్రక్రియపై కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పరిష్కరించి నియామక ప్రక్రియను చేపట్టాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు. విసిల నియామకంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం మితిమీరిన జోక్యం చేసుకుంటుంది. తమ భావజాలం ఉన్నవారిని విసిలుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుసోంది.



ఖాళీ పోస్టులు (2023 ఉన్నత విద్యామండలి విడుదల చేసిన జాబితా)

విశ్వవిద్యాలయం పేరు	ప్రొఫెసర్	అసోసియేట్ ప్రొఫెసర్	అసిస్టెంట్ ప్రొఫెసర్
ఆచార్య నాగర్జున	34	65	147
ఆదికవి నన్నయ	18	33	77
ఆంధ్ర	111	201	414
డాక్టర్ బిఆర్ అంబేద్కర్	15	27	67
ద్రవిడన్	13	22	45
కృష్ణా	16	29	63
రాయలసీమ	16	29	68
శ్రీ కృష్ణదేవరాయ	35	65	168
శ్రీ పద్మావతి మహిళా	26	52	109
శ్రీ వెంకటేశ్వర	53	100	269
విక్రం సింహపురి	23	42	82
యోగి వేమన	36	42	82
అబ్దుల్ హక్ ఉర్దూ	12	19	36
జెఎన్‌టియు ఎ	26	40	220
జెఎన్‌టియు గురజాడ	14	25	163
జెఎన్‌టియు కె	26	39	197
మొత్తం	474	859	2147



పోలవరం స్పిల్‌వే వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

గోదావరికి వరద ఉధృతి

- భద్రాచలం వద్ద 41.30 అడుగులకు చేరిన నీటిమట్టం
- పునరావాస కేంద్రాలకు ముంపు గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో గోదావరి ఉధృతి పెరిగింది. దీంతో, పోలవరం ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిపోతున్నారు. భద్రాచలం వద్ద శనివారం ఉదయం 41.30 అడుగులకు చేరిన నీటిమట్టం రాత్రి ఏడు గంటల వరకు నిలకడగా కొనసాగింది. దాదాపు ఏడు గంటల పాటు వరద నిలకడగా కొనసాగడంతో 18 గంటల అనంతరం ఆ ప్రభావం దిగువన ధవళేశ్వరం ఆనకట్ట వద్ద కనిపిస్తోంది. ఆదివారం వరద తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున తూర్పుగోదావరి జిల్లా సీతానగరం, తాళ్లపూడి, కడియం మండలాల్లోని లోతట్టు ప్రాంత లంక భూములకు ముంపు ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం మిగతా 7లో



కౌలు రైతు సంజీవరెడ్డి

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బనగానపల్లె (నంద్యాల జిల్లా)

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంద్యాల జిల్లా బనగానపల్లెలో శనివారం చోటుచేసుకుంది. సిఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బనగానపల్లె మండలం బత్తులూరుపాడు గ్రామానికి చెందిన కౌలు రైతు సంజీవరెడ్డి (52) ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మిరప పంటను సాగు చేశారు. పంటకు దిగుబడి రాకవడంతోపాటు అరకొర పండిన పంటకు గిట్టుబాటు ధర కూడా లభిచంలేదు. పంట సాగు కోసం సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశారు. రుణ దాతల ఒత్తిడి తాళలేక రెండు రోజుల క్రితం సంజీవరెడ్డి ఇంటి నుండి వెళ్లిపోయారు. బనగానపల్లె రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న పొలాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్టానికి స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలు మున్సిపాలిటీలు స్వచ్ఛ సర్వేక్షణ అవార్డుకు ఎంపికయ్యాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు. 10 లక్షల కంటే ఎక్కువమంది జనాభా ఉన్న కేటగిరిలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, 10 లక్షల లోపు జనాభా ఉన్న కేటగిరిలో గుంటూరు, మూడు లక్షలలోపు కేటగిరిలో తిరుపతి, మినిస్టీరియల్ అవార్డుల కేటగిరిలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంపికయ్యాయని వివరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సభ్య సమాజం తలదించుకునేలా మహిళా ఎమ్మెల్యేపై వైసిపి మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న ప్రసన్నకుమార్ రెడ్డి అసభ్యకరంగా మాట్లాడడం తగదని, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఆమె శనివారం మీడియాతో మాట్లాడారు. నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి మహిళా ఎమ్మెల్యేను తీవ్రమైన అవమానకరమైన మాటలతో దూషించారన్నారు. రాష్ట్రంలోని మహిళలంతా ఛీకొట్టుకొనేలా వైసిపి నేతలు వ్యవహరిస్తున్నారని, ఇలాగే ప్రవర్తిస్తే చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని ఆమె హెచ్చరించారు. ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్న వారిపై ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కూటమి పాలనలో కల్తీ మద్యం

- మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి పాలనలో కల్తీ మద్యం ఎక్కువైందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆరోపించారు. కల్తీ మద్యం మరణాలు చోటుచేసుకుంటే దానికి సిఎం చంద్రబాబే కారణమని, డిస్టిలరీల నిర్వాహకులంతా టిడిపి వారేనని పేర్కొన్నారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మద్యం తయారీకి యథేచ్ఛగా స్పిరిట్ వాడుతున్నారని, కల్తీ మద్యాన్ని బ్రాండెడ్ మద్యంగా విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి కల్తీ మద్యమని వివరించారు. కల్తీ మద్యం సిండికేట్ల తెరవెనుక ఉండి చంద్రబాబు వ్యవహారం నడిపిస్తున్నారన్నారు. ఎపి బ్లాక్, ఓల్డ్ అడ్మిరల్, ఎస్‌పివై999 తదితర బ్రాండెడ్ మద్యం పేరుతో కల్తీ మద్యాన్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుండి వినియోగానికి మించి అదనంగా స్పిరిట్ తెప్పిస్తున్నారని అన్నారు. ఏడాదిలో రూ.5,280 కోట్ల కల్తీ మద్యం విక్రయాలు జరిగాయని ఆరోపించారు.

విద్యార్థులకు కనీస హాజరు ఉండాలి

- హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

సెమిస్టర్ పరీక్షలు రాసే బిటెక్ విద్యార్థులకు నిర్దేశిత కనీస హాజరు విధిగా ఉండి తీరాలని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయంలో జెఎన్‌టియు, జిఎంఆర్‌ఐటి కళాశాల తయారుచేసిన నిబంధనలు సక్రమమేనని స్పష్టం చేసింది. కనీస హాజరు నిబంధనలు సరికాదంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. అనారోగ్యం కారణంగా కనీస హాజరు లేకపోయినప్పటికీ కౌశిక్ అనే విద్యార్థిని పరీక్షలకు అనుమతించాలని సింగిల్ జడ్జి ఉత్తర్వుల నేపథ్యంలో అతను తదుపరి సెమిస్టర్ పరీక్షలు రాశారు. కౌశిక్ 4, 5 సెమిస్టర్లను పూర్తి చేసినందున, కనీస హాజరు లేదని చెప్పి తిరిగి మూడో సెమిస్టర్‌కు పంపడాన్ని బెంచ్ తప్పుపట్టింది. కనీస హాజరు సమస్యను అధిగమించేందుకు మేకప్ క్లాసులకు కౌశిక్ హాజరయ్యేందుకు అనుమతించాలంది. ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఈవిధమైన అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఉత్తర్వులను తమకు కూడా వర్తింపజేయాలని భవిష్యత్‌లో కనీస హాజరు లేని విద్యార్థులు హైకోర్టును కోరడానికి వీల్లేదని తేల్చింది.



శ్రీకాకుళం జిల్లాలోని జిఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ (జిఎంఆర్‌ఎటి)లో కౌశిక్ బిటెక్ విద్యార్థి. అనారోగ్య సమస్యల కారణంగా తరగతులకు హాజరుకాకపోవడంతో కనీస హాజరు 65 శాతం లేకపోయింది. దీంతో మూడో సెమిస్టర్ పరీక్షకు అనుమతించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ జడ్జి ఆదేశాలతో పరీక్షలకు హాజరయ్యాడు. అయితే, అతని పరీక్ష ఫలితాలను కాలేజీ యాజమాన్యం వెల్లడించలేదు. తిరిగి హైకోర్టుకు రావడంతో మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వెల్లడించాలని, 4వ సెమిస్టర్ పరీక్షకు అనుమతికి ఉత్తర్వులు వెలువడ్డాయి. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కళాశాల యాజమాన్యం అప్పీల్ చేయడంతో డివిజన్ బెంచ్ పైవిధంగా తీర్పు చెప్పింది.

పాతికేళ్లుగా వేరుగా ఉంటున్న జంటకు విడాకులు

- హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

27 ఏళ్ల క్రితం పెళ్లయిన జంటకు హైకోర్టు విడాకులు మంజూరు చేసింది. పెళ్లి జరిగిన రెండేళ్లకు (1998 నుంచి) ఆ జంట వేర్వేరుగా ఉంటున్నందున ఇక కలిసే అవకాశం లేనందున విడాకులు ఇస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. చట్ట ప్రకారం ఆరు నెలలపాటు వేచి ఉండాలనే నిబంధన వారికి విధించినా ఉపయోగం లేదంది. వివాహ బంధం పునరుద్ధరణకు ఆస్కారం లేదని తేల్చింది. పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రకాశం జిల్లాకు చెందిన మహిళతో 1996లో పెళ్లి జరిగాక పాప పుట్టింది. వారి మధ్య విభేదాలు రావడంతో తల్లి తన చిన్నారిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. 2000లో విడాకుల కోసం ఆమె భర్త విజయవాడ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. తన భర్త మానసికంగా వేధిస్తూ, క్రూరంగా వ్యవహరిస్తున్నాడని, ఆఫీసులోని సహోద్యోగినితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, విడాకులు ఇవ్వొద్దని కౌంటర్ వేశారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కింది కోర్టు కొట్టేయడంతో, భర్త 2007లో హైకోర్టులో అప్పీల్ చేశాడు. తుది విచారణ దశలో భార్యాభర్తలు ఇద్దరూ వివాహ బంధాన్ని కొనసాగించబోమని తేల్చి చెప్పారు. దీనిపై డివిజన్ బెంచ్.. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13(1) (1ఏ) కింద క్రూరత్వం కారణంతో విడాకులివ్వాలనే పిటిషన్‌ను సెక్షన్ 13బి కింద పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకునే వ్యాజ్యంగా మార్పు చేస్తూ పైవిధంగా తీర్పు వెలువరించింది.

బలవంతపు భూ సమీకరణను ఒప్పుకోం

- బిసివై పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణం పేరిట రైతుల నుంచి బలవంతంగా భూ సమీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని బిసివై పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ తెలిపారు. అమరావతి నిర్మాణానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, కేవలం బలవంతపు భూ సమీకరణకు మాత్రమే తాము వ్యతిరేకమన్నారు.

ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతిలో ఇప్పటికే జరుగుతున్న భూ కుంభకోణాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయని, వాటిపై త్వరలోనే నిజాలు బయట పెడతామన్నారు. మొదటి విడత రైతులకు పూర్తిగా న్యాయం చేసిన తర్వాతే రెండో విడత రైతులకు పూర్తిగా సమీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజధాని ముసుగులో దేశంలోనే అతిపెద్ద భూ మాఫియా ఇక్కడ జరుగుతున్నట్లు రైతుల నుంచి సమాచారం అందుతోందన్నారు.

వాల్తేర్ డివిజన్ అభివృద్ధి పనులపై రామ్మోహన్‌నాయుడు సమీక్ష

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వివిధ అభివృద్ధి కార్యకలాపాలపై కేంద్ర పౌర విమానయాన మంత్రి కె రామ్మోహన్‌నాయుడు శనివారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. విశాఖ డిఆర్‌ఎం కార్యాలయంలో వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) లలిత్ బోహ్రా, విశాఖపట్నం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తాతో కలిసి నిర్వహించిన సమీక్షలో భాగంగా డిఆర్‌ఎం లలిత్ బోహ్రా స్టేషన్ పునరాభివృద్ధి పనులు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు, ఇతర కీలక అభివృద్ధి కార్యకలాపాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ప్రాంతంలో కనెక్టివిటీ, ప్రయాణికుల సౌకర్యాలను పెంపొందించడానికి చేపట్టిన చర్యలు అమృత్ స్టేషన్ల అభివృద్ధి, రైలు స్టాప్‌లు పొడిగింపులను, డివిజన్‌లోని డబుల్ లైన్, మూడవ లైన్, నాలుగో లైన్ పనులను మంత్రి సమీక్షించారు.



రైల్వే అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే స్టేషన్లలో మెరుగుదల పరిధిని విస్తృతం చేసే ప్రాముఖ్యతను కేంద్ర మంత్రి వివరించారు. రాష్ట్ర అధికారులు, ఇతర విభాగాలతో సమన్వయం అవసరమయ్యే పెండింగ్ పనులను వేగవంతం చేయడంలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎడిఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, ఎడిఆర్‌ఎం (ఇన్ఫ్రా) ఇ శాంతారామ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పట్ల సానుకూల నిర్ణయం

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. కార్మికుల డిమాండ్లు సాధ్యమైనంత వరకూ పరిష్కరించాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని సిఎం ఆదేశించారని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లపై కమిటీ పలుమార్లు చర్చించిందని, వారికి మేలు చేసేలా సానుకూల నిర్ణయం తీసుకుందని వివరించారు. ఆర్థికశాఖతో చర్చించిన తరువాత ప్రభుత్వ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తామని వివరించారు.

మంత్రి ప్రకటనలో స్పష్టత లేదు

- సమ్మె కొనసాగుతుంది
- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ వర్కర్ల సమ్మె విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి చేసిన ప్రకటనలో స్పష్టత లేదని, శనివారం అర్ధరాత్రి నుండి సమ్మె కొనసాగుతుందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం మంత్రి నారాయణ, పట్టణాభివృద్ధిశాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని, అందులో స్పష్టత లేదని పేర్కొన్నారు. జీతాల పెంపు ఆర్థికశాఖతో చర్చించాలన్నారని, కేటగిరీల నిర్ణయంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడం, షరతులు లేకుండా సంక్షేమ పథకాల అమలు, 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓలు జారీ చేయడం వంటి అంశాల ప్రస్తావన లేకపోడంతో కార్మికులను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని తెలిపారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారని, ప్రస్తుత పరిణామాలు ప్రభుత్వం కాలయాపన చేసేందుకు ప్రయత్నిస్తోందనే అనుమానాలు కలుగుతోందన్నారు. 10 నెలలుగా సమస్యల గురించి చెబుతున్నా పట్టించుకోలేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో జులై 12వ తేదీ అర్ధరాత్రి నుండి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, జులై 16 నుండి పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగాల్సి వస్తుందని తెలిపారు. దీనిపై వెంటనే స్పందించి, కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగు ఏర్పాటు చేసి, సమ్మె నివారణకు చర్యలు తీసుకుని ఉంటే బాగుండేదని పేర్కొన్నారు.

రైతుల ఆత్మహత్యలను అరికట్టాలి

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఆదుకోవాలి
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను నివారించాలని, నంద్యాల జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. నంద్యాలలోని టి.నరసింహయ్య భవన్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విధానాల వల్ల రైతాంగ ఆత్మహత్యలు తీవ్రస్థాయిలో పెరిగిపోతున్నాయన్నారు. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడులు పెరగగా.. దిగుబడులు మాత్రం నానాటికి తగ్గిపోతున్నాయని తెలిపారు. అరకొర పండిన పంటలకు మద్దతు ధరలు లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలో అనుసరిస్తోన్న కార్పొరేట్ విధానాల వల్ల రైతులు రోజురోజుకు దివాళా తీస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అన్ని ప్రాజెక్టుల్లో నీళ్లు సమృద్ధిగా ఉన్నా.. పాలకులు మాత్రం కాలువలకు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల మెట్టపైర్లు ఎండిపోతున్నాయన్నారు. ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నా రైతులు మాత్రం సొసైటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పొగాకు రైతాంగం రోడ్లపై కొచ్చి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ జిల్లాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన అన్ని రకాల ఎరువులను రైతాంగానికి రైతు సేవ కేంద్రాల ద్వారా వెంటనే పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, పాల్గొన్నారు.

24 గంటల్లో ధవళేశ్వరం వద్ద వరద తగ్గుముఖం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనా ప్రకారం ఆదివారం నుంచి ధవళేశ్వరం వద్ద వరద క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోదావరి వరద ప్రవాహం శనివారం సాయంత్రం 7 గంటలకు భద్రాచలం వద్ద 41.1 అడుగులు, ధవళేశ్వరం బ్యారేజీ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 5.29 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. విపత్తుల సంస్థలోని స్టేట్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ సంబంధిత జిల్లాల యంత్రాంగానికి సూచనలు జారీ చేస్తున్నామన్నారు. అత్యవసర సహాయక చర్యల కోసం అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఒకటి, ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరులో రెండు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వరద తగ్గేవరకు గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కర్నూలు జిల్లా మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో గల్లంతైన ముగ్గురి ఆచూకీ కోసం ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని పంపినట్లు ప్రఖర్ జైన్ తెలిపారు.

బిడ్డల కళ్లెదుటే తల్లి సజీవ దహనం

- భర్త మరణాన్ని తట్టుకోలేక అదేరోజు ఆత్మహత్య
- అనాథలైన చిన్నారులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్ (పల్నాడు జిల్లా)

ఏడాది కిందట భర్త ఆత్మహత్య చేసుకోగా అది జీర్ణించుకోలేని మహిళ ఏడాది తర్వాత అదే రోజున తన ఇద్దరు పిల్లలు సహా ఆత్మహత్యకు ఉపక్రమించింది. ఈ క్రమంలో పిల్లలు చావు నుండి తప్పించుకున్నా.. వారి కళ్లెదుటే తల్లి సజీవదహనమైంది. ఈ హృదయవిదారక సంఘటన పల్నాడు జిల్లా మాచర్ల మండలం అనుపు అటవీ ప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దగ్గుల బ్రహ్మారెడ్డి ఆరోగ్య సమస్యల కారణంగా గతేడాది జులై 12న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. దీన్ని తట్టుకోలేక ఆయన భార్య సుబ్బమ్మ (40) అప్పటి నుండి మానసికంగా తీవ్ర సంఘర్షణ పడుతున్నారు. ఈ క్రమంలో తన భర్త చనిపోయి శనివారంనాటికి ఏడాదైన సందర్భంగా సుబ్బమ్మ తన ఇంట్లోని భర్త ఫొటోకు తన ఇద్దరు పిల్లలతో కలిసి దండం పెట్టుకుంది. అనంతరం అనుపులోని గుడికి వెళ్లివద్దామని చెప్పి పిల్లలను వెంట తీసుకెళ్లింది. తొలుత మాచర్లకు వచ్చి పెట్రోల్ కొనుగోలు చేసింది. దేవుడిని దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. దారి మధ్యలో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తనపై పోసుకుంది. వెంటనే తన ఇద్దరు పిల్లలు పదమూడేళ్ల లక్ష్మీకార్తీకా రెడ్డి, పదేళ్ల అఖిల్‌రెడ్డిపై పోసే ప్రయత్నం చేయడంతో వారు భయంతో పరుగు తీశారు. ఆ తర్వాత సుబ్బమ్మ అగ్గిపెట్టెతో ఒంటికి నిప్పంటించుకోవడంతో మంటలు వ్యాపించి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని పిల్లలు పరిగెత్తుకుంటూ వెళ్లి అనుపులో ఉన్న సెక్యూరిటీ గార్డ్‌కు చెప్పారు. ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విజయపురిసౌత్ ఎస్ఐ డి.అశోక్‌వర్మ, ఎఎస్ఐ సోమయ్య ఘటనా స్థలికి చేరుకున్నారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు. ఏడాది కిందట తండ్రి, ఇప్పుడు తల్లి చనిపోవడంతో చిన్నారులు ఇద్దరూ అనాథలయ్యారు.

డిగ్రీ అడ్మిషన్లను వెంటనే చేపట్టాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు మొదలుకాకపోవడం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో గత ప్రభుత్వం ఉన్నత విద్యా రంగంలో అనేక మార్పులు చేసిందని, దీనివల్ల డిగ్రీ విద్యలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ విధానాలను ప్రతిపక్షంలో వున్నప్పుడు విమర్శించిన కూటమి పార్టీలు నేడు కొత్త విధానాన్ని రూపొందించకుండా డిగ్రీ ప్రవేశాలు ఆలస్యం చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని తొలగించి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం తెస్తున్నట్లు కూటమి నేతలు ప్రకటించిన కొద్దిరోజులకే మరలా సింగల్ సబ్జెక్టు విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించారని తెలిపారు. డిగ్రీ ప్రవేశాలు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలా అనే విషయంలో కూడా ఈ ప్రభుత్వానికి స్పష్టత లేదని, ఉన్నత విద్య పట్ల ఇంత గందరగోళంగా వ్యవహరించడం సరికాదని తెలిపారు. ఇంటర్ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఆందోళనలో వున్నారని వివరించారు. విద్యా సంవత్సరం ప్రారంభమే ఆలస్యమైతే చివర్లో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల్లో నెలరోజుల క్రితమే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, రాష్ట్రంలో ఆలస్యం కావడంతో డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని వివరించారు. ప్రభుత్వం స్పష్టమైన విధానాలతో డిగ్రీ అడ్మిషన్లను వెంటనే ప్రారంభించాలని కోరారు.



రోడ్డుపై దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఎన్.రామారావు

ఉక్కు దీక్షలను ముళ్లకంచెలు అడ్డుకోలేవు : సిఐటియు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్షలను ముళ్ల కంచెలు అడ్డుకోలేవని సిఐటియు నాయకులు ఎన్ రామారావు పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1612వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలు చేస్తున్న పైలాన్ చుట్టూ యాజమాన్యం ఇనుప ముళ్ల కంచెలను పెట్టడంతో దాని ముందు భాగంలో రోడ్డుపైనే దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రతినిధులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎన్ రామారావు మాట్లాడుతూ శాంతియుతంగా చేస్తున్న దీక్షలను జరగనీయకుండా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం, యాజమాన్యం కలిసి కుట్రలు పన్నుతున్నాయని, మొండివైఖరితో పోరాటాలను అణిచి, నిర్బంధాలకు గురిచేసి భయాందోళనలను సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన నిర్వాసితులు, శాశ్వత ఉపాధి లభించక కాంట్రాక్టు కార్మికులుగా తమ జీవనాన్ని సాగిస్తున్నారని, వారిని ఇప్పుడు స్టీల్ యాజమాన్యం తొలగించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఉపాధి నుంచి వారిని దూరం చేసి నేడు కొత్త వారిని మరలా విధుల్లోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం, యాజమాన్యాలు అనుసరిస్తున్న వైఖరి హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, యాజమాన్యాల వైఖరికి నిరసనగా కార్మిక వర్గం ఏకమై ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వైటి దాస్, కె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వంశీతో మాట్లాడుతున్న ఎఎస్ఐ


పోలీస్ విచారణకు హాజరైన వంశీ

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

కృష్ణా జిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ తీవ్ర జ్వరంలోనూ శనివారం విచారణకు హాజరయ్యారు. మైనింగ్ కేసులో ప్రతి నెలలో రెండవ శనివారం ఆయన పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. ఆయన ముక్కు రంధ్రం పూడిపోవడంతో శ్వాస తీసుకోవడానికి సమస్య ఏర్పడగా ప్రయివేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ తర్వాత గుండె సమస్య వచ్చినట్లు అనుమానించిన డాక్టర్లు శనివారం ఉదయం ఆయనకు ఎన్జియోగ్రామ్ చేశారు. ఈ క్రమంలో తీవ్ర జ్వరానికి లోనయ్యారు. అయినా కోర్టు ఆదేశాల మేరకు గన్నవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆయనను సిఐ శివ ప్రసాద్ విచారించారు. హనుమాన్ జంక్షన్, ఆత్కూర్ పోలీస్ స్టేషన్లకు వెళ్లి సంతకాలు చేశారు. అనంతరం వంశీ వైద్యం కోసం విజయవాడలోని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లారు.

సూళ్లూరుపేటలో 70 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)



అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో భారీగా గంజాయి పట్టుబడింది. తమిళనాడుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి చెంచుబాబు తెలిపారు. విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ... శనివారం ఉదయం కోట పోలూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులోని ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించడంతో వారిని వెంబడించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి, కారులోని 70 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తమిళనాడుకు చెందిన బిబినాథ్, రోహన్‌గా గుర్తించారు. వీరు గతంలోనూ గంజాయి, హత్య కేసులో ముద్దాయిలుగా ఉన్నారని డిఎస్‌పి వెల్లడించారు.

పేర్ని నానిపై చర్యలు తీసుకోవాలి

- బందరు పోలీసు స్టేషన్‌లో టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని)పై టిడిపి నాయకులు శనివారం కృష్ణా జిల్లా బందరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పామర్రులో జరిగిన వైసిపి కార్యకర్తల సమావేశంలో పేర్ని నాని చేసిన విద్వేషకరమైన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి నాయకులు కాగిత వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కన్ను కొడితే చీకట్లో అన్నీ అయిపోవాలి అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా పేర్ని నాని వ్యాఖ్యలు ఉన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవరిస్తున్నారని తెలిపారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సంవత్సరాలు మంత్రిగా పని చేసిన వ్యక్తి కార్యకర్తలకు ఏమి సందేశం ఇస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పేర్ని నానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు కాటం మధుసూదనరావు, తలారి సోమశేఖర్, లంకె శేషగిరి, వక్కపట్ల శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, వనరాజు తదితరులు ఉన్నారు.

ఏడాది పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

- టిడిపి కూటమి సర్కార్‌పై బొత్స విమర్శ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో అన్ని రంగాలు అస్తవ్యస్తమయ్యాయని శాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. మాటలు తప్ప అన్నదాతలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం చేయడంలేదని, రైతులను అత్యంత అసమర్థకరంగా, 'హేళన చేస్తూ దండుపాళ్యం బ్యాచ్' అంటూ మాట్లాడడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని కేబినెట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారన్న వార్తలు పత్రికల్లో చూస్తున్నామని, యథా రాజా.. తథా మంత్రులు అన్నట్టు రాజుగారు ఏ రకంగా దోపిడీ చేస్తున్నారో మంత్రులు కూడా అలాగే ఉంటారని పేర్కొన్నారు. ఇసుక, మట్టి, మద్యం దోపిడీ, ఖాళీ జాగా కనిపిస్తే కబ్జాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఇదంతా కేవలం ఏడాది కాలంలోనే జరుగుతోందని తెలిపారు. టిడిపి కూటమి నేతల మాయమాటలు విని ప్రజలు మోసపోయారన్నారు. విశాఖపట్నంలో ఇప్పుడు డ్రగ్స్ సంస్కృతి కూడా ప్రవేశించిందన్నారు. విశాఖ నగరాన్ని అభివృద్ధి బదులు డ్రగ్స్‌లో అంతర్జాతీయ నగరంగా పాలకులు మార్చారని విమర్శించారు.

దక్షిణ మధ్య రైల్వే జిఎంగా సంజయ్ కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే జిఎంగా సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1988 బ్యాచ్ ఇండియన్ రైల్వే ఇంజినీరింగ్ సర్వీస్ (ఐఆర్ఎస్ఇ)కి చెందినవారు.

గతంలో ఆయన సెంట్రల్ ఆర్గనైజేషన్ ఆఫ్ రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. శ్రీవాస్తవ ఆర్‌డిఎస్‌ఒలో ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇన్‌ఫ్రా-1)గా పనిచేశారు. ఆయన పదవీకాలంలో 60 కిలోల ఆర్‌350హెచ్‌టి గ్రేడ్ పట్టాలు, తొమ్మిది ప్రోటోలు, బిస్కాన్ సొరంగాలతో కూడిన ఎస్‌ఆర్‌బి/డి ఆర్‌బిటి, ఫ్లాష్ బట్ జాయింట్ల కోసం ఎంతో కృషి చేశారు.

'కూటమి' పాలనలో దళితులపై దాడులు

- నేడు విజయవాడలో సదస్సు : అంధ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

టిడిపి కూటమి పాలనలో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు అధికమయ్యాయని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంధ్ర మాల్యాద్రి అన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, జిల్లా ఉపాధ్యక్షులు వి.మోజెస్‌తో కలిసి స్థానిక ఎల్‌బిజి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాల్యాద్రి మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం దళితులను దగా చేస్తోందని దుయ్యబట్టారు. గత పదేళ్లుగా ఎస్‌సిలకు అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని నీరు గారుస్తుందని ఆరోపించారు. బాబూ జగజ్జీవన్ రామ్ పేరుతో ఎస్‌సిలకు 200 యూనిట్లు ఉచితంగా అందించే విధానం ఒంగోలు నగరంలో అమలు కావడం లేదన్నారు. తమ బృందం మామిడిపాలెం, గద్దలగుంటలో పరిశీలించగా ఉచిత విద్యుత్ పథకం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. పెంచిన ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో భాగంగా ఎస్‌సిలందరికీ ఎలాంటి షరతులూ లేకుండా సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. దళితుల సమస్యలపై ఆదివారం విజయవాడలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్గో ఎయిర్‌పోర్టుతో ఉద్దానం విధ్వంసం

- పోరాట కమిటీ చైతన్యయాత్ర
- వామపక్ష నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి- మందస (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా మందస ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు కోసం చేపట్టిన బలవంతపు భూసేకరణను ఆపాలని స్థానికులు పోరుబాట పట్టారు. ఇందులో భాగంగా కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మందస మండలంలోని రాంపురం, బిడిమి గ్రామాల్లో శనివారం చైతన్య యాత్రలు నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వామపక్షాల నాయకులు సంఘీభావం తెలియజేశారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరిట ఉద్దానంలో విధ్వంసం సృష్టిస్తున్నారని, ఈ విషయమై ప్రజలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గసభ్యులు కోనారి మోహనరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ పార్టీ నాయకులు మద్దిల రామారావు డిమాండ్ చేశారు. దేశంలో ఢిల్లీ, బెంగళూరు, బొంబాయి, విశాఖపట్నం నగరాల్లో ఎయిర్‌పోర్టుకు అనుబంధంగా కార్గో ఎయిర్‌పోర్టు ఉందని అన్నారు. దేశంలో ఎక్కడా ప్రత్యేకంగా కార్గో ఎయిర్‌పోర్టు లేదని, మరి ఇక్కడ ఎందుకు నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. దేశంలోనే అతి పెద్దదైన ఢిల్లీ ఎయిర్ పోర్టుకు అనుబంధంగా ఉన్న కార్గో ఎయిర్‌పోర్టు కేవలం 150 ఎకరాల్లో మాత్రమే ఉందని గుర్తు చేశారు. జాతీయ అవార్డులు అందుకుంటున్న పలాస జీడిని కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో విధ్వంసం సృష్టించడం తగదన్నారు. లక్షలాది చెట్లను నరకడం వల్ల పర్యావరణ పరంగానూ తీరని ముప్పు కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ నాయకులు పి.కుసుమ, కె.రమేష్, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



చైతన్యయాత్రను నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు



అదాని చిత్రపటాలను దగ్ధం చేస్తూ, విల్లంబులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా), అనంతగిరి (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట, రేగులపాలెంలోని చింతలపూడి ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్లాంట్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని, చేయకుంటే తరిమికొడతామని గిరిజనులు స్పష్టం చేశారు. అదాని హైడ్రోపవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా రేగులపాలెం వద్ద శనివారం అదాని చిత్ర పటాలను గిరిజనులు దగ్ధం చేస్తూ నిరసన తెలిపారు. సంప్రదాయ విల్లంభులతో ఆందోళన చేశారు. వీరికి మద్దతుగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ఆర్ఇడిసిఎపి) ద్వారా పెదకోట ఎరియాలో 800 మెగావాట్లు ఉన్న దాన్ని 1800 మెగావాట్లకు పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేగులపాలెం ప్రాంతంలోని రైవాడ, చింతలపూడి, మారిక గ్రామాల మధ్య 900 మెగావాట్స్ సామర్థ్యంతో లూప్ పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు 2019 నుండి 2025 మధ్య రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేశాయని తెలిపారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లోని ఆదివాసీలను, ఇతర పేదలను వారి ఆవాసాల నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించడం చట్ట వ్యతిరేకమన్నారు. హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల పెదకోట ప్రాంతంలో అత్యధిక గ్రామాలను ఖాళీ చేయించే పని అదాని మనుషులు పూనుకున్నారని తెలిపారు. దీన్ని గిరిజనులతో కలిసి ప్రతిఘటిస్తామని చెప్పారు. గిరిజనుల పోరాటాలను, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం జిఒ 51ను విడుదల చేయడం సరికాదన్నారు. పెదకోట ప్రాంతంలో గిరిజనులకు, అదాని మనుషులకు మధ్య ఘర్షణ జరిగే ప్రమాదముందని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

14న ఎపిఎల్ సీజన్-4 క్రీడాకారుల వేలం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ/మధురవాడ (విశాఖపట్నం): రాష్ట్ర స్థాయిలో క్రీడా ప్రమాణాలు పెంచి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా ఎపిఎల్-2025 సీజన్-4ను నిర్వహిస్తున్నామని, దీనికి సంబంధించి క్రీడాకారుల వేలం ఈ నెల 14న విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్ వేదికగా జరగనుందని ఎపిఎల్ గవర్నమెంట్ కౌన్సిల్ చైర్మన్ ఆర్‌వి.సుజయ్‌కృష్ణ రంగారావు తెలిపారు. విశాఖ నగరంలోని ఎసిఎ - విడిసిఎ మైదానంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఎపిఎల్ - 2025 సీజన్ వివరాలను వెల్లడించారు. గతంలో ఆరు జట్లతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను ఈసారి ఏడు జట్లకు విస్తరించామని తెలిపారు. గతంలో ఒక్కొక్క ఫ్రాంచేజి సగటు ధర రూ.75 లక్షలు ఉండగా.. ఈసారి సగటున రూ.2 కోట్ల వరకు వచ్చిందని వివరించారు. క్రీడాకారులకు మరింత వెసులుబాటును కల్పిస్తూ గతంలో 430 మంది వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించగా.. ఈసారి దానిని 520కి పెంచినట్లు తెలిపారు. క్రీడాకారులను నాలుగు కేటగిరీలలో విభజించామని, మార్కీంగ్ కేటగిరిలో 9 మంది, కేటగిరి -ఎలో 21 మంది, కేటగిరి - బిలో 112 మంది, కేటగిరి - సిలో 378 క్రీడాకారులను గుర్తించినట్లు చెప్పారు. ప్రతి జట్టులో ఇద్దరు అండర్ 19 క్రీడాకారులతోపాటు అండర్ 16లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఉండాలని నిబంధన పెట్టినట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఏడు జట్లు 9 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకున్నాయని, మిగిలిన వారిని వేలం ద్వారా ఆయా జట్లు దక్కించుకుంటాయని పేర్కొన్నారు. గతంలో 15 మ్యాచ్‌లతో నిర్వహించిన ఎపిఎల్‌ను ఈసారి 25 మ్యాచ్‌లకు విస్తరించామని, అందులో 21 లీగ్ మ్యాచ్‌లతోపాటు నాలుగు ప్లే ఆఫ్ మ్యాచ్‌లు ఉంటాయని వివరించారు. ఈసారి ఎపిఎల్ సీజన్‌లో ప్రతి మ్యాచ్‌కూ ప్రత్యేక బహుమతులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మాట్లాడుతూ.. ఆగస్టు 8వ తేదీ నుంచి ఎపిఎల్ మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. అన్ని మ్యాచ్‌లు విశాఖ స్టేడియంలో జరుగుతాయని వెల్లడించారు. స్టీల్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా, మైత్రి వంటి సంస్థలు ఈసారి ఫ్రాంచైజ్‌లుగా ముందుకు రావడం ఎపిఎల్‌కు శుభపరిణామం అని పేర్కొన్నారు.

లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యల సాధనకు ఐక్య పోరాటం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎఐఎల్ఆర్ఎస్ఎ) సికింద్రాబాద్ డివిజన్-విజయవాడ బ్రాంచ్ 6వ ద్వైవార్షిక మహాసభ శనివారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం.. కార్మికవర్గం, ప్రజానీకంపై అనేక విధాలుగా భారాలు మోపుతోందన్నారు. రైల్వేలతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ సంస్థలకు అధిక లాభాలు గడించడానికి తోడ్పడుతోందన్నారు. ప్రస్తుతం రైల్వేలో ఖాళీగా ఉన్న 3 లక్షల పోస్టులు భర్తీ చేయకుండా, ఉన్నవారిపై పని భారం, ముఖ్యంగా లోకో రన్నింగ్‌లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. ఎఐఎల్ఆర్ఎస్ఎ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ గురుమూర్తి మాట్లాడుతూ.. రైల్వే ప్రయాణికుల భద్రత కోసం లోకో సిబ్బందితో 8 గంటల కంటే అధికంగా పనిచేయించొద్దన్నారు. నూతనంగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వేజోన్ నేపథ్యంలో విజయవాడ డిపోను యథాతథంగా కొనసాగించాలని కోరుతూ రైల్వే యాజమాన్యంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ మహాసభలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నరసింహులు, ఎఐఎల్ఆర్ఎస్ఎ జాతీయ సహాయ కార్యదర్శి జివి లూ, ఎల్ఆర్ఎస్ఎ నాయకులు కె రామకృష్ణ, ఎం వెంకటేషన్, సుధీర్ మాట్లాడారు.

విజయవాడ బ్రాంచ్ అధ్యక్షులుగా కె రమేష్

మహాసభ అనంతరం విజయవాడ బ్రాంచ్‌కు నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా కె రమేష్, కార్యదర్శిగా కె రాజేష్‌కుమార్‌తోపాటు మరో 40 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

అక్టోబర్ 13,14,15 తేదీల్లో అనంతలో ఐద్వా రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభలు అనంతపురం కేంద్రంగా అక్టోబర్ 13, 14, 15వ తేదీల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా శనివారం అనంతపురం ఎన్‌జిఒ హోంలో ఐద్వా రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి వి సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై హింస పెరిగిపోతోందన్నారు. ఈ క్రమంలో ఐద్వా రాష్ట్ర మహాసభ అక్టోబర్ 13, 14, 15వ తేదీల్లో అనంతపురం నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో మూడు సంవత్సరాల ఉద్యమ సమీక్ష చేసుకోవడంతో పాటు నేడు ముందుకొచ్చిన పలు అంశాలపై చర్చిస్తామన్నారు. మహాసభ గొంతుకగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మైక్రో ఫైనాన్స్ సమస్యలు, మద్యం సమస్యలు, కులాంతర వివాహితుల సమస్యలు, పసి బిడ్డలపై జరుగుతున్న దాడులు, ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలులో జాప్యం తదితర వాటిపై చర్చిస్తామన్నారు. మహాసభల విజయవంతానికి అందరూ సహాయ సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, స్నేహలత నర్సింగ్ హోమ్ డాక్టర్ అరుణ, అధ్యక్షులు, లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ, ఫ్యాట్రన్స్ గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వికె పద్మావతమ్మ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ఫ్యాట్రన్స్ ఎస్‌వి సూపర్‌మార్కెట్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, రవికాంత్ రమణ, ప్రముఖ వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్, బాలాకుమారి, ప్రసూన, మాధవి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.



పివి నరసింహారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించిన పివి


- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి
- పరిగిలో కాంస్య విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి-పరిగి (శ్రీసత్యసాయి జిల్లా)

ఎంతోమంది పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడిన వ్యక్తి భారతరత్న, మాజీ ప్రధాని పివి నరసింహారావు అని ఆయన కుమార్తె, తెలంగాణ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని కొడిగేనహళ్లి ఎక్సలెన్స్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పివి నరసింహారావు కాంస్య విగ్రహాన్ని శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ పేద విద్యార్థులు బాగా చదువుకోవాలని పివి నరసింహారావు తపన పడేవారన్నారు. పరిగిలో తన తండ్రి ఏర్పాటు చేసిన కొడిగేనహళ్లి ఎక్సలెన్స్ పాఠశాలలో చదువుకున్న ఎందరో దేశ, విదేశాల్లో అత్యున్నత స్థాయిలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాను చదువుకున్న రోజుల్లో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కొడిగినహళ్లి పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులుగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. 2025-26 సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి 1979 బ్యాచ్ ద్వారా రూ. ఐదు లక్షల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు పెరుగు సురేష్, కార్యదర్శి సల్మాన్ రాజ్, పిఆర్ఈఐ సొసైటీ ప్రిన్సిపల్ సెక్రటరీ మస్తానయ్య, పాఠశాల ప్రిన్సిపల్ మత్స్య రాజు, ఐఆర్ఎఎస్, ఎఫ్ఎ సిఇఒ ఆంజనేయులు, ఐఆర్‌టిఎస్ ఎపి డైరెక్టర్ వి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాత కారు కొనేస్తే పోలా..!

- అమ్మకాల్లో 10 శాతం పెరుగుదల
- సగటున నాలుగేళ్లలోపే అమ్మేస్తున్నారు..
- రూ.4 లక్షల కోట్లకు మార్కెట్



న్యూఢిల్లీ : కొత్త కార్ల ధరలు భారీగా పెరగడంతో అనేక మంది పాత కార్ల కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఉపయోగించిన (యూస్డ్) కార్ల విక్రయాలు 60 లక్షల యూనిట్లను దాటే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. విలువ ఆధారిత డిమాండ్, డిజిటల్ క్రయ, విక్రయ వేదికల విస్తరణ, వాహన ఫైనాన్స్ లభ్యత మెరుగుదల ఈ మార్కెట్‌కు మద్దతును అందిస్తుందని పేర్కొంది. క్రిసిల్ రేటింగ్స్ రిపోర్ట్ ప్రకారం.. కొత్త కార్ల అమ్మకాలతో పోల్చితే ఉపయోగించిన కార్ల విక్రయాలు 1.4 నిష్పత్తికి చేరుకున్నాయి. అంటే రెండు కొత్త కార్ల అమ్మకాలు జరిగితే.. మూడు పాత కార్లు విక్రయానికి వస్తోన్నాయి. ఇది ఐదేళ్ల క్రితం 1.0 కంటే తక్కువగా ఉండేది. అంటే అప్పుడు ఒక్కటికి.. ఒక్కటిగా అమ్మకాలు జరిగేవి. ఉపయోగించిన కార్ల విలువ కొత్త కార్ల కంటే రెట్టింపు వేగంతో వృద్ధి చెందుతోంది. ఈ యూస్డ్ కార్ల మార్కెట్ విలువ సుమారు రూ.4 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. ఇది కొత్త కార్ల విక్రయాల విలువతో దాదాపు సమానంగా ఉండటం విశేషం.

ఆర్థిక సంవత్సరాలు 2017-24 మధ్య యూజ్డ్ కార్ల విక్రయాలు మందకోడిగా 5 శాతం పెరుగుదలను నమోదు చేయగా.. గత ఆర్థిక సంవత్సరంలో 8 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10 శాతం వరకు వృద్ధి చోటు చేసుకోనుందని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేథి అంచనా వేశారు. "ఉపయోగించిన కార్ల విక్రయాల నిష్పత్తి ఐదు సంవత్సరాల క్రితం 1.0 కంటే తక్కువ నుండి 1.4 రెట్లకు మెరుగుపడడం, వినియోగదారుల విశ్వాసం పెరగడం, డిజిటల్ విక్రేతల వేదికలు పెరగడం ఈ రంగంలో మార్పును సూచిస్తుంది. ఉపయోగించిన కార్ల సగటు విక్రయ వయస్సు 3.7 సంవత్సరాలకు చేరుకుందని అంచనా. ఇది వేగవంతమైన మార్పు, ఇది పాత, కొత్త వాహనాల పట్ల పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది." అని అనుజ్ సేథి పేర్కొన్నారు.

నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లలో తగ్గుదల

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై 10 నాటికి కేంద్ర ప్రభుత్వ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 1.3 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే తక్కువగా ఉన్నాయని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. కార్పొరేట్, నాన్-కార్పొరేట్ పన్ను వసూళ్లలో తగ్గుదలనే ఇందుకు కారణం. 2025-26లోని జులై 10 వరకు స్థూల వసూళ్లు 3.2 శాతం పెరిగి రూ.6.6 లక్షల కోట్లకు చేరాయి. అయితే ఇదే సమయంలో రిఫండ్‌లు 38 శాతం పెరిగాయి. దీనివల్ల నికర వసూళ్లు తక్కువగా చోటు చేసుకున్నాయి. దీంతో నికర వసూళ్లు రూ.5.6 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఈ మొత్తం 2024-25 ఇదే కాలంతో పోలిస్తే 1.3 శాతం తక్కువ. నికర కార్పొరేట్ పన్ను రాబడిలో 3.7 శాతం క్షీణిత చోటుచేసుకుంది. వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు, సంస్థలు, అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్, బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్, స్థానిక అధికారులు తదితర నాన్‌కార్పొరేట్ పన్ను వసూళ్లు 0.04 శాతం తగ్గాయి.

ఎక్స్ ప్రీమియం సబ్ స్క్రిప్షన్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ : ఎలన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' భారత్‌లోని వినియోగదారులకు తన ప్రీమియం సేవలపై తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపింది. దేశంలో ఎక్కువ మంది యూజర్లకు చేరువయ్యేందుకు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను భారీగా 48 శాతం తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. దీనిపై ఇప్పటివరకు నెలకు రూ.900 వసూలు చేయగా.. దానిని రూ.470కి తగ్గించింది. ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకున్న వినియోగదారులు బ్లూటిక్ పొందడం సహా సుదీర్ఘ పోస్టులు చేసుకోవడానికి వీలు కల్పిస్తోన్నట్లు పేర్కొంది. అదే విధంగా వెబ్ మోడ్‌లో ఎక్స్‌ను వినియోగించే వారికి నెల ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ధరను రూ.650 నుంచి రూ.427కి తగ్గించింది. నెలవారీ బేసిక్ సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను రూ.244 నుంచి రూ.170కి తగ్గించింది. బేసిక్ వినియోగదారుల వార్షిక సబ్‌స్క్రిప్షన్‌లను కూడా రూ.2,590 నుంచి రూ.1,700 తగ్గించినట్లు ఎక్స్ వెల్లడించింది. తన ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఎక్స్ 2023 అక్టోబర్‌లో తొలిసారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది.

టిడిఆర్ బాండ్లను ఐక్యంగా వ్యతిరేకిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి- మునగపాక (అనకాపల్లి జిల్లా)

రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులు టిడిఆర్ బాండ్లను ఐక్యంగా వ్యతిరేకించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసి కార్పొరేటర్ బి.గంగారావు పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన అనకాపల్లి- అచ్చుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితుల 24 గంటల దీక్షా శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు. దీక్షలో కూర్చున్న సిపిఎం నాయకులు, నిర్వాసితులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితులకు నష్ట పరిహారం అంటూ ఇస్తున్న టిడిఆర్ బాండ్లు చట్ట వ్యతిరేకమని అన్నారు. కొంతమంది దళారీలు తమ పబ్బం గడుపుకునేందుకు ఈ బాండ్లను తెరపైకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. లేని భూమి ఉన్నట్లు చూపించి తమ జేబులు నింపుకోవడానికి చేసే మోసం టిడిఆర్‌లు అని తెలిపారు. పల్లె ప్రాంతాల్లో టిడిఆర్‌లు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. వంద అడుగుల విస్తరణమంటూ 150 అడుగులను ఆధీనంలో తెచ్చుకొని నిర్వాసితులను మోసగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. అచ్యుతాపురం పరిశ్రమల పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఆసియా అభివృద్ధి బ్యాంకు రూ.347 కోట్లు కేటాయిస్తుందని, రూ.150 కోట్లు నిర్వాసితులకు ఇవ్వడం ప్రభుత్వానికి ఏపాటిదని ప్రశ్నించారు. నిర్వాసితులు ప్రతిఘటిస్తే సెంటు భూమి కూడా తీసుకోలేరని హెచ్చరించారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించే వరకు 14 గ్రామాల ప్రజలు ఐక్య పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకరరావు, నిర్వాసిత సంఘం కన్వీనర్ ఆర్.రాము, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న గంగారావు

సంపాదకీయం


సర్కారు బడి!

విద్య విజ్ఞానానికి పునాది. అది రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు. సామాజిక, సాంస్కృతిక వికాసానికి వాహిక విద్య. స్వాతంత్య్రానికి ముందు, ఆ తర్వాత కూడా విద్యాభ్యాసాన్ని ఒక సంస్కరణగా, ఒక విప్లవోద్యమంగా నడిపారు. ఈ క్రమంలో నెలకొల్పిన ప్రభుత్వ బడులే పేద బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపాయి. లక్షలాది కుటుంబాలకు ఆశాదీపాలుగా మారాయి. దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల పిల్లలు ఎదిగొచ్చారంటే, ఉన్నత విద్యావంతులుగా తయారయ్యారంటే... ముఖ్యంగా ఆడపిల్లలు చదువుకోగలిగారంటే దానికి కారణం ప్రభుత్వ బడులే. 'విద్య ఒక్కటే సామాజిక అసమానతలను రూపుమాపే సాధనం' అంటారు అంబేద్కర్. రాను రాను ప్రభుత్వ బడుల్లో చదివే వారి శాతం తగ్గుతూ వస్తోంది. పాలకవర్గాలు ఒక పథకం ప్రకారం ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ... దాని పీక నులుముతున్నారు. ఆధునిక జీవన ప్రమాణాలకు తగినట్లుగా ప్రభుత్వ విద్యను పరిపుష్టం చేయాల్సి వుండగా, దానికి భిన్నంగా కార్పొరేట్ విద్యాసంస్థలను పెంచి పోషిస్తున్నారు. విద్యను సరుకుగా మార్చి, ప్రాథమిక విద్యావ్యవస్థ తల్లివేరును పెరికివేసే ప్రయత్నం చేస్తున్నారు. 'దేశాభివృద్ధి పాఠశాల గుమస్తుల చేత కాదు, పాఠశాలల్లో చదివిన బుద్ధిజీవుల చేత మాత్రమే సాధ్యపడుతుంది' అంటారు గురజాడ. ఇవాళ ఆ బుద్ధి జీవులు ఎదిగే వేదికలలో అజ్ఞాన, అశాస్త్రీయ పాఠ్యాంశాలను చొప్పిస్తున్నారు. జాతీయ విద్యావిధానం పేరుతో విజ్ఞాన వాటికలను మూసివేస్తున్నారు.

ప్రభుత్వ బడి చుట్టూ రాజకీయ దుమారం చెలరేగుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యావిధానంలో మార్పులు తెస్తూ నూతన విద్యాసంస్కరణల పేరుతో ప్రభుత్వ బడుల జీవనాడిని తెంపుతున్నారు. 2018లో 38 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో ఉంటే, ఈ ఏడాదికి ఆ సంఖ్య 32.61 లక్షలకు తగ్గిందని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. దీన్ని అవకాశంగా తీసుకొని-ఆంగ్ల మాధ్యమంపై ఆసక్తితో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించే స్థోమత లేనివారు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావడంలేదని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఒక కుక్కను చంపడానికి... అది పిచ్చిదని ముద్ర వేసినట్టుగా... ప్రభుత్వ బడులపైనా ముద్ర వేస్తున్నారు. విద్యను వ్యాపారంగా మార్చి, కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వాలు వున్నంతకాలం దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వ విద్య వధ్య శిలపైకి నెట్టబడుతూనే వుంటుంది. ప్రభుత్వ బడుల్లో పెద్దఎత్తున ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం, తగినన్ని మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల విద్యలో నాణ్యత పడిపోతోంది. దీంతో ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు సంకోచిస్తున్నారు. విద్యార్థులు తగినంత మంది లేరన్న సాకుతో ప్రభుత్వం వీటిని మూసివేస్తోంది. ఇదంతా విద్య ప్రైవేటీకరణకు ప్రభుత్వం ఆడుతున్న నాటకం. ప్రపంచ బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా సాల్ట్, ఎన్ఇపి సంస్కరణలు తెచ్చి, విద్యావ్యవస్థను ప్రయివేటీకరణ వైపు నెడుతున్నారు.

విద్యా నాణ్యతను మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి బదులు, పిల్లలు రావడంలేదనే సాకుతో ప్రభుత్వ బడులను మూసివేయడమంటే సమస్యను మరింత పెంచడమే. 'విద్యా గుళ్లు మూసినా, ప్రశ్నించే మనసుల తలుపులు మూయలేరు' అంటారు దాశరథి. అత్యంత చిన్న దేశమైన క్యూబాలో చదువు బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే తీసుకుంటోంది. విద్యలో దేశంలోనే అగ్రస్థానంలో వున్న కేరళ, ప్రభుత్వ విద్యకే పెద్ద పీట వేస్తున్నది. నిజానికి ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడితే, దానికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. బలోపేతం చేయాలి. అంతేతప్ప వాటిని మూసివేయడమే పరిష్కారం కాదు. ఈ దేశంలో ప్రాథమిక విద్య రాజ్యాంగం కల్పించిన హక్కు. పేద పిల్లల హక్కులను ప్రభుత్వమే నాశనం చేస్తే, అది ప్రజాస్వామ్యానికి హానికరం. ప్రభుత్వ బడులు మూసివేత విద్యారంగానికి మాత్రమే కాకుండా, సామాజిక న్యాయానికి కూడా గండికొడుతుంది. 'బలవంతంగా పాలించే ప్రభుత్వానికి బలం.. బలప్రయోగమే. కానీ, మన బలం జ్ఞానం... విద్యలో వుంది' అంటారు జ్యోతిరావు పూలే. నాణ్యమైన, నైతిక విలువలతో కూడిన విద్యను అందించే ప్రభుత్వ బడులను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉంది.

మహనీయుల మాట




మరణించినప్పుడు మనం
భౌతిక జీవితాన్నే కోల్పోతాం.
కాని మనం నశించిపోతే
మానవత్వమే మంటగలసిపోతుంది.
మానవత్వం అంటే మానవులుగా
మనం నిర్వర్తించాల్సిన 'ధర్మం'.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి, నోబెల్ గ్రహీత.

Rabindranath Tagore

చరమాంకంలో నితీశ్ పాలన? ఇ.సి కి సుప్రీం షాక్?

ప్రస్తుతం



తెలకపల్లి రవి

పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత ప్రధాని నరేంద్రమోడీ స్పందన ఎలా వుంటుందా అని ప్రపంచమంతా చూస్తుంటే ఆయన బీహార్‌కు వెళ్లి అధికార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ కీలక హిందీ రాష్ట్రంలో కొంత ఇంగ్లీషులో మాట్లాడుతూ...నా నరాల్లో రక్తం కాదు, ఆగ్రహం ప్రవహిస్తున్నది అనేట్టు చెప్పుకొచ్చారు. విదేశాలకు అర్థం కావడం కోసం ఇంగ్లీషులో మాట్లాడారనుకోవచ్చు గానీ దాడి జరిగిన కాశ్మీర్ చుట్టుపక్కల ప్రాంతాలనూ దేశ రాజధానిని వదలిపెట్టి బీహార్ వెళ్లి ఇవి మాట్లాడాల్సిన అవసరమేమొచ్చింది? ఎన్నికలు అక్టోబరులో వస్తాయన్న వాస్తవమే ఆయనతో అలా మాట్లాడించింది. ఉగ్రవాద ఘాతుకానికి గురైన రాష్ట్రంలో ఏం చేయాలనే దానికన్నా ఆ అంశాన్ని రాజకీయంగా కీలకమైన బీహార్‌లో ఎలా ఉపయోగించుకోవాలన్నదే ఆయనకు ప్రధానమై పోయిందని అందరూ వ్యాఖ్యానించారు. అయితే మోడీగానీ ఆయన పార్టీ బిజెపి గానీ ఇలాంటి వాటిని పెద్దగా పట్టించుకునే రకం కాదు. ఏదో విధంగా విజయం సాధించడం, ప్రాబల్యం పెంచుకోవడమే వారి ఏకైక సూత్రం. దేశంలో మూడుసార్లు ఏదోలా అధికారంలోకి వచ్చినా వారికి కొరుకుడు పడని రాష్ట్రాలు కొన్ని వున్నాయి. వాటిలో బీహార్ ఒకటి. ఎప్పుడో జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం లేదా యాభయ్యేళ్ల ఎమర్జెన్సీ నాటి నుంచి ఇప్పటి వరకూ ఒక్కసారైనా వారు బీహార్‌లో స్వంతంగా అధికారంలోకి రాలేకపోయారు. అవకాశవాద ముఖ్యమంత్రి, జెడియు అధినేత నితీశ్ కుమార్ అటూ ఇటూ మారుతుండడాన్ని ఉపయోగించుకునే వారు మనుగడ సాగిస్తున్నారు. షరా మామూలుగా ఈ క్రమంలో నితీశ్‌ను వెనక్కు నెట్టి తామే పెద్ద శక్తిగా తయారైనారు కూడా. అయినా వంటరిగా పోరాడగలిగిన సత్తా, ధైర్యం కూడా బిజెపికి లేవు. 2020 శాసనసభ ఎన్నికల్లో ఆర్జెడి తో కలసి పోటీ చేసిన జెడియు కన్నా వారికే అధిక స్థానాలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఆర్జెడి 75 స్థానాలతో అతి పెద్ద పార్టీగా వస్తే బిజెపి 74 స్థానాలతో రెండవ స్థానంలోకి వచ్చింది. 44 తెచ్చుకున్న జెడియు మూడో స్థానంతో ఆగిపోయింది. అయినా ఒప్పందం మేరకు మొదట ఆర్జెడి నేత తేజస్వి యాదవ్ నితీశ్ నే ముఖ్యమంత్రిని చేశారు. కానీ తన ప్రాబల్యం తగ్గిపోవడం సహించలేని నితీశ్ 2017లో చేసినట్టే 2022లో మళ్లీ జట్టు మార్చి బిజెపితో కలిశారు. బిజెపి ఆయన నాయకత్వాన్ని కొనసాగిస్తున్నా గతంలో ఇచ్చిన ప్రాధాన్యత మాత్రం తగ్గించేసింది. హిందూత్వ రాజకీయాలు సరేసరి. అయినా ముఖ్యమంత్రి పీఠమే పరమావధిగా భావించే నితీశ్ తల వంచి బతికేస్తున్నారు. గతంలోని నితీశ్‌కూ ఇప్పటికి అసలు పోలికే లేదని అందరూ అంటున్న పరిస్థితి.

బీహార్‌లో భిన్న పరిస్థితులు

బీహార్ ఎన్నికలలో కులం ప్రధాన పాత్ర వహిస్తుందని చెబుతుంటారు గానీ వాస్తవంలో అక్కడ పేదరికం, సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటం కూడా దాని వెనక వుంటాయని గమనించాలి. భూస్వామ్య పీడన దారుణంగా కొనసాగిన రాష్ట్రమది. ఆర్‌జెడి గత ఇరవై ఏళ్లలో మధ్యలో రెండుసార్లు రెండేళ్ల చొప్పున మాత్రమే అదీ భాగస్వామిగా వుండటం తప్ప ప్రతిపక్షంలోనే వుంది. స్వతహాగా ముస్లిం, యాదవ ఓటర్లు దానికి పునాదిగా వుంటారని భావిస్తారు. ఈసారి ముందే మేల్కొని కుష్వాహ్, ధానుక్, మల్లా వంటి ఇతర వెనకబడిన కులాల వారిని కూడా తన వైపు తిప్పుకోవడానికి కేంద్రీకరించి పని చేసింది. ఈ వర్గాలకు చెందిన వారిని అత్యధికంగా లోక్‌సభకు పోటీ చేయించింది. రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి కూడా ఇచ్చింది. ఇదే తరహాలో కాంగ్రెస్, బిఎస్‌పి లు జాతవ్‌లపై కేంద్రీకరించాయి. కొన్ని ప్రాంతాలలో దళితులలో సిపిఐ(ఎం.ఎల్) పార్టీ పట్టు కలిగి వుంది. ఇండియా వేదికలో వీరందరూ భాగస్వాములుగా వుండటం ఒకటైతే మిగిలిన చోట్లవలె గాక ఇక్కడ అది గట్టిగానే కొనసాగడం పరిస్థితిలో కీలకాంశంగా వుంటున్నది. అందువల్లనే పైకి ఏమి చెప్పినా తాము నితీశ్‌ను ముందు పెట్టుకుని పోవలసిందేనని బిజెపి నాయకులు బాహాటంగానే ఒప్పుకుంటున్నారు. మహిళా ఓటర్లలో ఆయనకు పట్టు ఎక్కువని వారి అంచనా. దానికి తగినట్టే ఎన్నికలు రాబోతున్న వేళ నితీశ్ మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ ప్రకటన చేయడం వారిని నిలబెట్టుకునే ప్రయత్నం మాత్రమే. అయితే ధరలు, అత్యాచారాలు, మత రాజకీయాల కారణంగా మొత్తంగానే ఆయన బలహీనపడిపోయిన మాట నిజం.


వామపక్షాల చొరవ, ఇండియా కొనసాగింపు

మోడీని ప్రధాని అభ్యర్థిగానే అంగీకరించబోనని 2014లో బీరాలు పలికి కూటములు మార్చి పదవి కాపాడుకున్న నితీశ్ తర్వాత 2017లో ప్లేటు ఫిరాయించి వుండకపోతే బీహార్‌లోనే గాక దేశంలో కూడా రాజకీయాలు మరోలా వుండేవేమో. ఇదే మళ్లీ 2022లోనూ ఆయన పునరావృతం చేశారు. అందుకే ఆయనను 'పల్టు బాబు' అని బీహార్ ప్రజలు, నాయకులు అపహాస్యం చేస్తుంటారు. ఈ విషయంలో తనతో పోటీ పడగలిగింది ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమే. ఈ ఇద్దరు నాయకులు మనుగడ కోసం బిజెపిని మోయకపోతే మోడీ మూడోసారి ప్రధాని కాగలిగేవారు కాదనవచ్చు. కాకపోతే ప్రసుతం ఎ.పి లో వైసిపి, టిడిపి రెండూ బిజెపికి అనుకూలంగా వుంటే బీహార్‌లో మాత్రం లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడైన తేజస్వి యాదవ్ ఇండియా వేదికను కొనసాగిస్తూ నితీశ్‌కు ప్రధాన సవాలుదారుగా ముందుకొచ్చారు. రాహుల్ గాంధీతో పాటు మల్లికార్జున ఖర్గే వంటి వారు కూడా దాదాపు బీహార్‌లోనే తరచూ కనిపించడం గమనించదగింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అనవసరంగా పట్టు పట్టి అధిక స్థానాలు తీసుకుని ఓటమిపాలై వుండకపోతే నితీశ్ బిజెపితో కలిసినా సర్కారులోకి రాగలిగేవారు కాదు. అందుకే ఇప్పుడు ముందు నుంచే దాని స్థానాలు తగ్గించేందుకు తేజస్వి రంగం సిద్ధం చేస్తున్నారు. మరోవంక వామపక్షాలకు ఒకప్పటి బలం తగ్గినా 2020లో కూడా 4.4 శాతం ఓట్లు వచ్చాయి. ఈ కాలంలో చెప్పుకోదగిన అనేక పోరాటాలు, ఉద్యమాలు కూడా జరిగాయి. మొన్నటి జులై 9 సమ్మెకు ఉభయ కమ్యూనిస్టు పార్టీల ప్రధాన కార్యదర్శులు ఎం.ఎ.బేబి, డి.రాజా బీహార్‌లోనే వుండటం గమనించదగింది. ఉత్తర భారత దేశంలో బిజెపి చేజిక్కని ఈ ఏకైక రాష్ట్రాన్ని ఈసారైనా బిజెపి వ్యతిరేక పాలనలోకి తీసుకురావడం కీలక కర్తవ్యంగా మారింది. మిగతా పార్టీలు కేవలం కులాల లెక్కలే తీసుకుంటే వామపక్షాలు మాత్రం జాతీయ స్థాయిలో కార్పొరేట్, మతతత్వ కూటమిని ఓడించడం కీలకంగా భావిస్తున్నాయి. బీహార్‌లో ఇండియా వేదిక యథాతథంగా కొనసాగడానికి వామపక్షాల పాత్ర కూడా మరో ముఖ్య కారణం. ఇందుకు భిన్నంగా నితీశ్ కుమార్ 2024 ఎన్నికలకు ముందు కూడా రకరకాలుగా ఊగిసలాటలు సాగించిన తీరు దేశంలో నవ్వుల పాలైంది. అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి, బి.ఆర్.ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు కూడా నాలుగో కూటమి అంటూ బీహార్ సందర్శించడం నాయకత్వం ఎవరు వహించాలనే దానిపై ఉభయులూ చెరో విధంగా మాట్లాడటం గుర్తుండే వుంటుంది. అవకాశవాద రాజకీయాలకు పగ్గాలు వేసి లౌకిక శక్తుల ఐక్యత కొనసాగించాలంటే వామపక్షాల పాత్ర వుండాలనేదానికి బీహార్ ఒక ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తుంది. లాలూ ప్రసాద్ యాదవ్ పాలనలో అవినీతి, ఏకపక్ష పోకడల వంటి ఆరోపణలు ఎన్ని వున్నా బిజెపితో ఒకసారి కూడా పరోక్షంగానైనా చేయి కలపకపోవడం ఆయన లౌకిక నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. సరిగ్గా ఈ కారణంగానే ఇతర పాలక పార్టీల నాయకుల వలె గాక ఆయనది మాత్రమే 'జంగిల్ రాజ్' (ఆటవిక పాలన) అని మోడియా మోత మోగిస్తుంటుంది. 'సుశాశన్ బాబు' బిరుదు ధరించిన నితీశ్ హయాంలో ఏకంగా 18 వంతెనలే కొట్టుకుపోవడం కన్నా ఇందుకు మరో ఉదాహరణ అవసరం లేదు. లాలూ ప్రసాద్ యాదవ్ హయాంలో అరాచకం తాండవించిందని గగ్గోలు పెట్టిన బడా మీడియా ఇప్పుడు మాత్రం దీన్ని ప్రముఖంగా చెప్పడంలేదంటే బిజెపి వెనక వుండటమే కారణం. ఇప్పటికీ కూడా ఈ వర్గాలు బిజెపి నితీశ్ కలయికనే ఎక్కువగా చూపుతూ ఇండియా వేదిక అవకాశాలను తక్కువగానే చూపిస్తున్నాయి. అయితే అవినీతి, అసమర్థ పాలనకు తోడు నితీశ్ కుమార్ ప్రతిష్ట దిగజారడంతో పాటు ఆరోగ్యం కూడా ఈ కాలంలో బాగా దెబ్బతిన్నది. వేదికలపైనే ఆయన ఏం మాట్లాడుతున్నారోనని మొహాలు చూసుకునే పరిస్థితి ఏర్పడింది. బహిరంగ సభల్లో ఐఎఎస్‌లను వేడుకోవడం, కాళ్లు పట్టుకోవడం వంటి విపరీతాలను చూసి జనం విస్తుపోయిన సందర్భాలున్నాయి. ఇప్పుడు ఆయన ప్రగతి యాత్ర వంటి తతంగాలతో శక్తికి మించి తంటాలు పడుతున్నారు. బీహార్ అంటేనే నితీశ్ గుర్తుకు వస్తారనేది వారి జపంగా మారింది. గతంలో అమిత్‌షా వంటి వారు నాయకత్వం కూర్చుని మాట్లాడుకోవటం అన్న పరిస్థితి ఇప్పుడు లేదు. 'దో హజార్ పచీస్ ఫిర్ సే నితీష్' నినాదం ఎత్తుకున్నారు.

మైనార్టీలపై కుట్ర? సుప్రీం తీర్పు?

ఇందుకు భిన్నంగా లాలూ పగ్గాలు తేజస్వికి అప్పగించడమే గాక మరో కుమారుడైన తేజ్ ప్రతాప్‌ను బయటికి పంపించేశారు. బిజెపి మత రాజకీయాలు, హిందూత్వ పోకడలు మైనార్టీలను దూరం చేస్తుండగా బీహార్‌లో ఆ అవకాశం మరింత ఎక్కువగా వుంది. మోడీ 2015లో కూడా అప్పటి నితీశ్, లాలూ కలయికను పాకిస్తాన్ కూటమిగా ప్రచారం చేసి భంగపడటం తెలిసిందే. మొన్న పహల్గాం దాడి తర్వాత ఆయన బీహార్ నుంచే నరాల్లో సిందూర్ ప్రవహిస్తోందని పెద్దగా ప్రకటించడం దాన్ని గుర్తుచేసింది. అయితే ఇలాంటి అతిశయోక్తులు లౌకిక వాదులనూ అల్ప సంఖ్యాకులను మరింత దూరం చేశాయి. కనుకనే ఇప్పుడు 'సర్' (ఎస్.ఐ.ఆర్) పేరిట ఎన్నికల సంఘం ద్వారా ఓట్ల అత్యవసర తనిఖీ చేపట్టడానికి కారణమదే. దొడ్డిదారిలో పౌరసత్వ సవరణ చట్టం వర్తింపచేసి లక్షలాది మైనార్టీ ఓట్లను తొలగించడం ద్వారా మొత్తం 89 స్థానాల్లో ఫలితాలు తారుమారు చేయొచ్చన్నది ఇక్కడ కుటిల ఎత్తుగడ. ఓటు పోయినవారు దానిపై కోర్టుకు వెళ్లడానికి కూడా సమయం వుండదని స్వయంగా సుప్రీంకోర్టు ఆక్షేపించింది. రాజ్యాంగ పరంగా ఓట్ల జాబితాల తనిఖీకి అభ్యంతరం చెప్పకపోయినా ఈ సమయంలో 11 పత్రాలు చూపించాలంటూ మెడపైన కత్తి పెడితే ఎలాగని ప్రశ్నించింది. జులై 20 దీనిపై తదుపరి విచారణ వుండబోతుంది. ఏ దశలోనైనా సుప్రీంకోర్టు దీనిపై ఎలాంటి నిర్ణయమైనా ప్రకటించవచ్చుననే వాస్తవం ఎన్‌డిఎకు కొంత ఆందోళనగా వుంది. వలస కార్మికులు అధికంగా వుండే బీహార్‌లో సాధారణ నివాసం వుండే చోట మాత్రమే ఓటు వుంటుందని ఎన్నికల సంఘం ప్రకటించడం ప్రకంపనలు సృష్టించింది. ఒక్క హైదరాబాద్ చుట్టుపక్కలనే 12 లక్షల మంది దాకా బీహార్ కార్మికులు వుంటారని అంచనా. వారు బీహార్‌లోనే వున్నా స్థిరమైన ఇల్లు వంటివి వుండవు గనక అధికార పత్రాలన్నీ వుండకపోవచ్చు. వారందరినీ బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ ముస్లిం చొరబాటుదారులుగా చూపించి ఓట్లు తీసేయడం పెద్ద కుట్ర. మహారాష్ట్ర ఎన్నికల తరుణంలో చేసిన ఈ కుట్ర బీహార్‌లో ముందే ప్రారంభించారని ప్రతిపక్ష నాయకుడుగా రాహుల్ గాంధీ ముందే చేసిన ఆరోపణ అంతర్జాతీయంగా ప్రచారమైంది. ఈ పూర్వ రంగంలో అటు రాజకీయ కలయికలు, ఇటు రాజ్యాంగ పరమైన అంశాలు ఎలా ముగుస్తాయో చూడాలి. ఇరవై ఏళ్ల నితీశ్ పాలనకు ఈ ఏడాది చివరి అంకమేనా? కేంద్రంలో స్వంతంగా మెజార్టీ కోల్పోయిన బిజెపికి బీహార్ మరో చివరి దెబ్బ వేస్తుందా?

★



దొడ్డిదారిలో పౌరసత్వ సవరణ చట్టం వర్తింపచేసి లక్షలాది మైనార్టీ ఓట్లను తొలగించడం ద్వారా మొత్తం 89 స్థానాల్లో ఫలితాలు తారుమారు చేయొచ్చన్నది ఇక్కడ కుటిల ఎత్తుగడ. ఓటు పోయినవారు దానిపై కోర్టుకు వెళ్లడానికి కూడా సమయం వుండదని స్వయంగా సుప్రీంకోర్టు ఆక్షేపించింది. రాజ్యాంగ పరంగా ఓట్ల జాబితాల తనిఖీకి అభ్యంతరం చెప్పకపోయినా ఈ సమయంలో 11 పత్రాలు చూపించాలంటూ మెడపైన కత్తి పెడితే ఎలాగని ప్రశ్నించింది. జులై 20 దీనిపై తదుపరి విచారణ వుండబోతుంది. ఏ దశలోనైనా సుప్రీంకోర్టు దీనిపై ఎలాంటి నిర్ణయమైనా ప్రకటించవచ్చుననే వాస్తవం ఎన్‌డిఎకు కొంత ఆందోళనగా వుంది.

'సుశాశన్ బాబు' బిరుదు ధరించిన నితీశ్ హయాంలో ఏకంగా 18 వంతెనలే కొట్టుకుపోవడం కన్నా ఇందుకు మరో ఉదాహరణ అవసరం లేదు. లాలూ ప్రసాద్ యాదవ్ హయాంలో అరాచకం తాండవించిందని గగ్గోలు పెట్టిన బడా మీడియా ఇప్పుడు మాత్రం దీన్ని ప్రముఖంగా చెప్పడంలేదంటే బిజెపి వెనక వుండటమే కారణం. ఇప్పటికీ కూడా ఈ వర్గాలు బిజెపి నితీశ్ కలయికనే ఎక్కువగా చూపుతూ ఇండియా వేదిక అవకాశాలను తక్కువగానే చూపిస్తున్నాయి. అయితే అవినీతి, అసమర్థ పాలనకు తోడు నితీశ్ కుమార్ ప్రతిష్ట దిగజారడంతో పాటు ఆరోగ్యం కూడా ఈ కాలంలో బాగా దెబ్బతిన్నది. వేదికలపైనే ఆయన ఏం మాట్లాడుతున్నారోనని మొహాలు చూసుకునే పరిస్థితి ఏర్పడింది. బహిరంగ సభల్లో ఐఎఎస్‌లను వేడుకోవడం, కాళ్లు పట్టుకోవడం వంటి విపరీతాలను చూసి జనం విస్తుపోయిన సందర్భాలున్నాయి. ఇప్పుడు ఆయన ప్రగతి యాత్ర వంటి తతంగాలతో శక్తికి మించి తంటాలు పడుతున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకుందాం

సమస్య



బి. వెంకట్

గ్రామీణ భారతంలో కుల, మత, లింగ బేధం లేకుండా అన్ని రకాల ప్రజలకు వారి జీవన హక్కులను బలోపేతం చేయడానికి 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (దాన్ని నరేగా అని కూడా పిలుస్తున్నారు) పార్లమెంటులో ఆమోదించబడి చట్టంగా తయారైంది. మొట్టమొదటి యుపిఏ ప్రభుత్వ కాలంలో వామపక్షాల సంపూర్ణ మద్దతుతో రూపొందించబడింది. 2014లో బిజెపి కేంద్రంలో అధికారం చేజిక్కించుకోగానే ఉపాధి చట్టానికి తూట్లు పొడవడం మొదలు పెట్టి దాని స్ఫూర్తిని నాశనం చేయడానికి చర్యలు చేపట్టింది. పార్లమెంటులో తయారైన శాసనానికి ఏ విధమైన చర్చ లేకుండా దానికి మార్పులు చేయడం ద్వారా...చట్టం స్ఫూర్తినేకాక భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిపై కూడా ఆ పార్టీ దాడి చేయడం ప్రారంభించింది.

ఉపాధిపై బిజెపి దాడి

అధికారంలోనికి వచ్చిన నాటి నుండి బిజెపి ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని నీరుగార్చడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నది.

మొదటిది: మొట్టమొదట పథకం ప్రవేశ పెట్టినపుడు కేంద్ర బడ్జెట్లో నాలుగు శాతం నిధులు అంటే 2.5 లక్షల కోట్లు కేటాయించగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 1.37 శాతం (రూ.86 వేల కోట్లు) మాత్రమే కేటాయించింది. అంతేకాక గతేడాది కేటాయింపుల కంటే ఈ సంవత్సరపు కేటాయింపులు పెరగకపోగా కేటాయించిన పూర్తి బడ్జెట్‌ను కూడా ఈ పథకానికి వినియోగించడంలో పూర్తిగా విఫలమైంది. చట్టం ప్రకారం రకరకాల కారణాలచేత కనీసం వంద పని దినాలు కల్పించడంలో విఫలమవుతుండగా బడ్జెట్ కేటాయింపులు ఈ పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. ఈ ఏడాది సగటున కల్పించిన పని దినాలు 50.23 కాగా గత ఆర్థిక సంవత్సరం ముందు అది 52.8 గా ఉంది. అంటే రానురానూ బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదనడంలో సందేహం లేదు.

రెండవది: నమోదైన కూలీల పేర్లు అర్ధాంతరంగా తొలగించడం. గత సంవత్సరానికి ముందు ఉపాధి పథకానికి 25.2 కోట్ల మంది నమోదు కాగా ఆధార్ ఆధారిత ధ్రువీకరణ తర్వాత ఆ సంఖ్య 18.28 కోట్లకు తగ్గింది. అంతమందినే ప్రభుత్వం ఈ పథకానికి అర్హులుగా నిర్ధారించింది. బిజెపి ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం ప్రవేశపెట్టిన నాటి నుండి ఈ పరిస్థితి నెలకొన్నది. ఒకపక్క గ్రామీణ భారతంలో కొన్నేళ్లుగా నిరుద్యోగం, ఉపాధి లేమి పెరుగుతుండగా ఉపాధి కల్పించే జాబు కార్డుల తొలగింపు కూడా పని దినాల తగ్గింపుకు దారితీసింది. 2020 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం 389.09 కోట్ల పనిదినాలు కల్పించగా గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 286.26 కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించింది.

మూడవది: ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిన కొత్తలో దళిత ఆదివాసీల అసైన్డ్ భూములను అభివృద్ధిపరిచే పని బాగా ప్రోత్సహించడం జరిగింది. ఫలితంగా గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక పరిస్థితుల్లో కొంతమేరకు వృద్ధి కనబడింది. కాగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత భూములపై కాక పట్టణ ప్రాంత భూముల అభివృద్ధిపై దృష్టి సారించింది. గతంలో 65 శాతం నిధులు వ్యవసాయ లేదా దాని అనుబంధ కార్యకలాపాలకు వినియోగించితే నేడు అది 46.74 శాతానికి పడిపోయింది. మరొక ముఖ్యమైన డిమాండ్ ఉపాధి వ్యవసాయ పనులను అనుసంధానించడం. ఉపాధి పనులను పెంచడానికి బదులుగా బిజెపి ప్రభుత్వం గ్రామీణ నిరుపేద రైతు కూలీలను భూస్వాముల ధనికుల భూముల్లో పని చేయమని బలవంతం చేస్తున్నది. తద్వారా గ్రామీణ ధనవంతులతో రైతు కూలీల బేరసారాల శక్తి తగ్గిపోయింది పనిదినాల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఉపాధి చట్టానికి మరిన్ని తూట్లు పొడుస్తూ బిజెపి సర్కార్ రాష్ట్రాలకున్న నిర్ణయాత్మక శక్తి లేకుండా కేవలం కొద్ది సంఖ్యలో మాత్రమే పని దినాల కేటాయింపుకు తెగబడింది.

నాలుగవది: ఉపాధి హామీ చట్టం అమలులో రైతు కూలీలకు పని దినాలు తగ్గే విధంగా యంత్ర సాంకేతికతను ప్రోత్సహించడం, సామాగ్రి విడి భాగాల కొనుగోలు ఖర్చును ఈ నిధుల నుండే ఖర్చు చేయడం జరిగింది. ఈ పథకం ప్రవేశపెట్టిన కొత్తలో కేవలం పది శాతం మాత్రమే వస్తువులు విడిభాగాలకు కేటాయించారు. మిగిలిన నిధులు రైతు కూలీల జీతాలు చెల్లింపులకు వినియోగించారు కానీ నేడు అది 36 శాతానికి పెరిగింది. యంత్రాల వాడకం కూడా పెరిగింది. పర్యవసానంగా రైతు కూలీల బదులు యంత్రాలు సాంకేతికత వినియోగం పెరిగి పని దినాలు పడిపోయాయి.

ఐదవది: ఈమధ్య ఉపాధి రైతు కూలీలకు రెండు నుండి ఏడు శాతం వేతనం మాత్రమే పెంచడం కేవలం వారిని స్పష్టంగా ఈ పనులకు దూరంగా ఉంచడమే. వారి శ్రమ దోపిడీకి పాల్పడడమే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 300 నుండి 307కు పెరగగా బీహార్‌లో 245 నుండి 255కు కేరళలో 346 నుండి 349కి వారి వేతనాలు పెరిగాయి. ఈ రకమైన పెంపు చేసినప్పుడు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని జీవన వ్యయాన్ని గమనంలోనికి తీసుకోకపోవడం సిగ్గుచేటు. ఉపాధి చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన జీతాన్ని కేంద్రం కూడా అమలు పరచాలి. కేరళ ప్రభుత్వం 800 రూపాయలు నిర్ణయించగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది చాలా తక్కువగా ఉండటం శోచనీయం.

నిధులు ఇవ్వకుండా నీరుగార్చే కుట్ర

ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం త్రైమాసిక నిధులుగా రూ.29,803 కోట్లు గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు విడుదల చేసింది. ఇందులో రూ.19,226 కోట్లు మాత్రమే రాష్ట్రాలకు కేటాయించింది. పనిచేసిన రైతు కూలీలకు 14 రోజుల్లోగా చెల్లింపులు జరగాలి కానీ ఇప్పటికీ లక్షలాది మందికి సకాలంలో చెల్లింపులు జరగక అవస్తలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పూర్తిగా కేటాయించిన నిధులను రాష్ట్రాలకు విడుదల చేయకపోవడం దారుణం. బిజెపి ఈ విధంగా నిరుపేదలపై దాడికి పూనుకోగా కొన్ని రాష్ట్రాలు గ్రామాలను పట్టణీకరించే పనిలో అత్యుత్సాహం చూపుతున్నాయి. వాటిని మున్సిపాలిటీలలో కలుపుతున్నాయి. ఉపాధి చట్టం పట్టణాలకు వర్తించదు కాబట్టి ఆ చట్టం అమలు కొన్నిచోట్ల ప్రశ్నార్థకం అవుతున్నది. ఇది కేవలం పంచాయతీల్లోని గ్రామాలకు మాత్రమే వర్తిస్తుంది. అంటే ఇది చట్టాన్ని నీరుగార్చే కుట్రలో మరో భాగం. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ నాయకత్వంలోని ప్రభుత్వంలో అవినీతి పేరుకుపోయిందనే సాకుతో గత మూడేళ్లుగా ఆ రాష్ట్రానికి కేంద్రం ఉపాధి నిధులు విడుదల చేయడం లేదు. నిధులు ఆపి గ్రామీణ కూలీలను ఇబ్బంది పెట్టిన కేంద్రం తీరును ఇటీవల కలకత్తా హైకోర్టు తప్పుపట్టింది. ఉపాధి గ్రామీణ ప్రజల హక్కు అని తేల్చిచెబుతూ 2025 ఆగష్టు ఒకటినుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసింది.

సంఘటిత ఉద్యమాలే శరణ్యం

ప్రపంచ బ్యాంకు నిబంధనల ప్రకారం మూడు డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్నవారు అత్యంత నిరుపేదలు. ఉపాధి హామీ చట్టం అమలు కారణంగా గ్రామీణ పేదలు అంతకన్నా ఎక్కువ ఆదాయం పొందడంతో అత్యంత నిరుపేదల లిస్టు నుండి వారు బయటపడ్డారు. కానీ ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ అమల్లోకి రావడంతో తిరిగి వారు మళ్లీ పేదరికంలోనికి నెట్టి వేయబడుతున్నారు. కేంద్రం విధానాల వల్ల నేటి గ్రామీణ భారతంలో నిరుపేదలకు, ధనస్వాములకు ఒక వైరుధ్యం ఏర్పడుతున్నది. ఈ అంతరాలను తొలగించడానికి మనం గ్రామీణ నిరుపేదల పక్షాన నిలవాలి. వారిని సంఘటిత పరిచి ముందుకు నడిపించాలి. అందుకుగాను కేంద్రం ఉపాధి బడ్జెట్‌ను రూ 2.5 లక్షల కోట్లకు పెంచేలా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవాలి. అలాగే ఏడాదికి 200 పనిదినాలు కల్పించేలా, కనీస వేతనం రూ.600గా నిర్ణయించేలా పోరాటాలు చేయాలి. అప్పుడు మాత్రమే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకోగలం. ఇది నేటి ఆవశ్యకత.

/ వ్యాసకర్త అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, సెల్ : 9490098045 /



ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం త్రైమాసిక నిధులుగా రూ.29,803 కోట్లు గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు విడుదల చేసింది. ఇందులో రూ.19,226 కోట్లు మాత్రమే రాష్ట్రాలకు కేటాయించింది. పనిచేసిన రైతు కూలీలకు 14 రోజుల్లోగా చెల్లింపులు జరగాలి కానీ ఇప్పటికీ లక్షలాది మందికి సకాలంలో చెల్లింపులు జరగక అవస్తలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పూర్తిగా కేటాయించిన నిధులను రాష్ట్రాలకు విడుదల చేయకపోవడం దారుణం. బిజెపి ఈ విధంగా నిరుపేదలపై దాడికి పూనుకోగా కొన్ని రాష్ట్రాలు గ్రామాలను పట్టణీకరించే పనిలో అత్యుత్సాహం చూపుతున్నాయి. వాటిని మున్సిపాలిటీలలో కలుపుతున్నాయి. ఉపాధి చట్టం పట్టణాలకు వర్తించదు కాబట్టి ఆ చట్టం అమలు కొన్నిచోట్ల ప్రశ్నార్థకం అవుతున్నది.

కరేడులో భూసేకరణ నిలిపివేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- 14న కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు

ఇండోసోల్ కంపెనీ ఏర్పాటుకు భూములు ఇవ్వబోమంటూ కరేడు గ్రామసభ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని గౌరవించి టిటిడి కూటమి ప్రభుత్వం తక్షణమే ఆ ప్రాంతంలో భూసేకరణ నిలుపుదల చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాయి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కరేడు గ్రామ ఉద్యమ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చేస్తోన్న పోరాటాన్ని వివరించారు. రైతుల సమస్యలను ప్రపంచానికి తెలియజేయాలన్న ఆలోచనతో ఐదువేల మంది ప్రజలు, రైతాంగం కలిసి జాతీయ రహదారి దిగ్బంధనం చేశారని తెలిపారు. 39 మంది రైతులమీద పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేయడం శోచనీయమన్నారు. అనంతరం మూడు అంశాలకు సంబంధించిన తీర్మానాలను రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ తీర్మానాల్లో ప్రధానంగా ఇండోసోల్ కంపెనీ ఏర్పాటుకు భూములు ఇవ్వబోమంటూ కరేడు గ్రామ సభ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని గౌరవించి కూటమి ప్రభుత్వం తక్షణమే ఈ ప్రాంతంలో భూసేకరణ నిలుపుదల చేయాలని, వ్యవసాయ రక్షణ కోసం చేస్తున్న ఉద్యమానికి, పోరాటానికి మద్దతుగా ఈ నెల 14న 'సేవ్ కరేడు.. సేవ్ అగ్రికల్చర్' పేరుతో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి జిల్లా నుంచి శ్రీకారం చుట్టాలని, కరేడు ప్రాంత రైతాంగ ఉద్యమానికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా 'వ్యవసాయం గెలవాలి.. వ్యవసాయం నిలవాలన్న' నినాదంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది.

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, రైతు సంఘం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు, రైతు సంఘాల నాయకులు చిరసాని కోటిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, రైతు సంఘం నాయకులు షాన్‌వాజ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శంకర్ కిషోర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సాగర్, పౌరహక్కుల సంఘం నాయకులు ఎల్లంకి వెంకటేశ్వర్లు, గిరీష్, దళిత నాయకులు జాషువా, కెవిపిఎస్ నాయకులు ఆలూరు తిరుపాలు, సంఘమిత్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.రవీంద్రరెడ్డి, కరేడు గ్రామ రైతు సంఘం నాయకులు మిరియం శ్రీనివాసులు, మధురెడ్డి, మాల కొండారెడ్డి, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అంతానికి వైసిపి కుట్రలు

- టిడిపి నేతలు బోడె ప్రసాద్, కొనకళ్ల నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేందుకు వైసిపి శ్రేణులు కుట్రలు చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఇరువురు కలిసి ఉమ్మడిగా విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి పేర్ని నాని రీకాల్ నరకేయండి అని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం చేసి ప్రజల మన్ననలు పొందాలని పదేపదే చెప్తుంటే వైసిపి మాత్రం హత్యలు చేయండి, తలలు నరకండని చెబుతున్నారని అన్నారు. రేషన్ బియ్యం, అక్రమ మైనింగ్, భూ దందా, అవినీతి సొమ్ముతో పేర్ని నాని వీర్రవిగి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఓడిపోయిన అవమానంతో, అసూయతో తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

వీసా వచ్చినా.. 'బహిష్కరణ ముప్పు'

న్యూఢిల్లీ : ట్రంప్ రెండో సారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై అమెరికా కఠిన వైఖరి అనుసరిస్తుంది. అలాగే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసింది. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అమెరికా తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని ఆ దేశపు రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. 'వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తునే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలు రద్దు చేసి దేశం నుంచి వెళ్లగొడతాం' అని రాయబార కార్యాలయం పోస్ట్‌లో స్పష్టంచేసింది. వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను సమర్పించాల్సి ఉంటుందని ఇటీవలే అమెరికా వెల్లడించిన సంగతి తెలిసిందే. అలా అని వాటిలో ఉన్న పోస్టులు ఏవి ఉన్నప్పటికీ డిలీట్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ అలా చేసినట్లు కనిపిస్తే పరిశీలన మరింత లోతుగా వెళ్లి తనిఖీ చేసే అవకాశం ఉంటుంది.

వచ్చే వారం చైనాకు జైశంకర్

- ఎస్‌సిఒ మంత్రుల సమావేశానికి హాజరు

బీజింగ్ : వచ్చే వారం చైనా నగరమైన తియాన్జిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) విదేశాంగ మంత్రుల సమావేశానికి విదేశాంగ మంత్రి జై శంకర్ హాజరవుతున్నారు. ఈ సమావేశం 15న జరుగుతుందని చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశానికి హాజరవడంతో పాటూ జై శంకర్ చైనాలో పర్యటిస్తారని అధికార ప్రతినిధి చెప్పారు. అయితే వివరాలు వెల్లడించలేదు. వివిధ రంగాల్లో ఎస్‌సిఒ సహకారంపై మంత్రులు పరస్పరం అభిప్రాయాలు పంచుకుంటారు. అలాగే ప్రధాన అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై కూడా చర్చిస్తారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు సాధారణ స్థాయికి తీసుకువచ్చే క్రమంతో పాటూ ఆటోమొబైల్స్‌తోసహా పలు ఉత్పత్తులకు అవసరమైన కీలకమైన లోహాల ఎగుమతిని చైనా నిలిపివేయడంపై కూడా చర్చలు జరుగుతాయని భావిస్తున్నారు. చైనావిదేశాంగ మంత్రి వాంగ్ యి కూడా ఈ నెల్లో భారత్ వచ్చే అవకాశం వుంది.



వివేకా హత్య కేసులో నిందితుడికి బెదిరింపులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తనను చంపుతామని బెదిరించారని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ముద్దాయిగా ఉన్న ఉమాశంకర్‌రెడ్డి పులివెందుల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. తాడిపత్రికి చెందిన రఘునాథ్ రెడ్డి అనే వ్యక్తి సింహాద్రిపురం మండలం కసునూరు గ్రామానికి చెందిన కొమ్మ పరమేశ్వర్ రెడ్డి పేరు చెప్పి ఈనెల 11న ఫోన్ చేసి.. చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు. 2024 నవంబర్ 18న తెలంగాణ హైకోర్టు ప్రతి శనివారం పులివెందుల సిఐ ముందు హాజరుకావాలని షరతులతో కూడిన బెయిల్ ఉమా శంకర్‌రెడ్డికి మంజూరు చేసింది. బెయిల్ మంజూరు అయినప్పటి నుంచి ఆయన పులివెందులలోనే ఉంటున్నారు. రఘునాథరెడ్డిని పోలీసులు పులివెందుల స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్టు సమాచారం.

గుడివాడలో ఉద్రిక్తత

- టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ
- జడ్‌పి చైర్‌పర్సన్ కారుపై దాడి

ప్రజాశక్తి-గుడివాడ

కృష్ణా జిల్లా గుడివాడలో ఫ్లెక్సీల వివాదం టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణకు దారితీసింది. వైసిపి నేత కొడాలి నానికి చెందిన కె.కన్వెన్షన్ ఇందుకు వేదికైంది. లింగవరంలోని కె.కన్వెన్షన్‌లో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ పేరుతో కొడాలి నాని ఆధ్వర్యంలో ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. మరోవైపు ఆ ప్రాంతంలోనే గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి శ్రేణులు ర్యాలీగా నాగవరప్పాడు సెంటర్‌కు చేరుకున్నాయి. వైసిపి సమావేశానికి ఆహ్వానం పలుకుతూ నాగవరప్పాడు సెంటర్‌లో ఆ పార్టీ నేతలు ప్రత్యేక బ్యానర్లు ఏర్పాటు చేశారు. అలాగే మాజీ మంత్రి కొడాలి నాని అవమానిస్తూ టిడిపి నేతలు బ్యానర్లు ఏర్పాటు చేశారు. టిడిపి నాయకులు నినాదాలు చేస్తూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. కొందరు టిడిపి నాయకులు వైసిపి బ్యానర్లను చించేశారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. మరోవైపు వైసిపి సమావేశం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నాగవరప్పాడు దగ్గక కె.కన్వెన్షన్‌లో వద్దకు వెళ్లేందుకు టిడిపి కార్యకర్తలు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న వైసిపి నేతలు కె.కన్వెన్షన్ నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న డిఎస్‌పి ధీరజ్ వినీల్ నేతృత్వంలోని పోలీసులు వారు బయటకు రాకుండా నిలువరించారు. ఈ నేపథ్యంలో వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పల హారిక కారును టిడిపి శ్రేణులు ధ్వంసం చేశాయి. తొలుత ఆమె నాగవరప్పాడు సెంటర్ మీదుగా కె.కన్వెన్షన్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆమె కారును టిడిపి నేతలు అడ్డగించారు. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకొని కారును అక్కడి నుంచి పంపించారు. ఆమె వెనక్కి వెళ్లి మళ్లీ తిరిగిరావడంతో రెచ్చిపోయి కారుపై రాళ్లతో దాడి చేశారు. అతి కష్టం మీద ఆమె కారును అక్కడి నుంచి పోలీసులు వెనక్కి పంపించారు. ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు బందోభస్తు ఏర్పాటు చేశారు.

విమాన ప్రమాదంపై అప్పుడే తుది నిర్ణయానికి రావొద్దు

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

విశాఖపట్నం : అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ఇచ్చిన ప్రాథమిక నివేదికపై పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దని, తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలని సూచించారు. 'ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు, సిబ్బంది మన దగ్గర ఉన్నారు. వారు పౌర విమానయానానికి వెన్నెముక వంటి వారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. ఇలాంటి సమయంలో ఎలాంటి నిర్ధరణకు రాకుండా తుది నివేదిక కోసం వేచిచూద్దాం. ఈ కేసులో ఎన్నో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయి. అందుకే ఈ నివేదికపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుంది" అని విశాఖపట్నంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఎఎఐబి 15 పేజీలతో తాజాగా ప్రాథమిక నివేదికను సమర్పించిన నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

పైలట్లు లేకుండానే దర్యాప్తు ఎలా చేస్తారు..?
నివేదికపై ఎఎల్‌ఎఫ్‌ఎ అసంతృప్తి

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ఇచ్చిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌లైన్స్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఎల్‌ఎఫ్‌ఎ) ఖండించింది. విచారణ జరిగిన తీరు, నివేదికలో వివరాలు వెల్లడించిన విధానం పైలట్లదే తప్పిదమనే అర్థం గోచరించేలా పక్షపాత ధోరణిలో ఉందని విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. "మీడియాకు లీక్ అయిన ఈ నివేదికపై బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఏ అధికారి సంతకం లేదు. ఈ దర్యాప్తులో ఎలాంటి పారదర్శకత కనిపించలేదు. అత్యంత గోప్యంగా జరిగిన ఈ ప్రక్రియ ఎంతగానో ఆశ్చర్యపర్చింది. నిపుణులైన మరీ ముఖ్యంగా లైన్ పైలట్లు (షెడ్యూల్డ్ ఫ్లైట్లు నడిపే వారు) ఆ దర్యాప్తులో భాగం కాలేదు" అని ఆల్ఫా అధ్యక్షుడు సామ్ థామస్ ప్రకటనలో విమర్శించారు. విమానం ఇంజిన్ ఇంధన స్విచ్‌ల అనుకోని కదలికలు దుర్ఘటనకు కారణమంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన కథనాన్ని అసోసియేషన్ ప్రస్తావించింది. ఇలాంటి సున్నితమైన సమాచారం మీడియాకు లీక్ కావడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. పారదర్శకత కోసం పరిశీలకులుగా తమను విచారణలో భాగం చేసుకోవాలని కోరింది.

విచారణకు సహకరిస్తాం
నివేదికపై బోయింగ్ సంస్థ స్పందన

ఎఎఐబి సమర్పించిన నివేదికపై బోయింగ్ సంస్థ స్పందించింది. విచారణకు పూర్తిగా సహకరిస్తామని వెల్లడించింది. విమాన ప్రమాదంలో చనిపోయిన వారి చుట్టూ తమ ఆలోచనలు తిరుగుతున్నాయని విచారం వ్యక్తంచేసింది. విచారణకు, తమ కస్టమర్‌కు పూర్తిగా సహకరిస్తామని తెలిపింది. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ప్రొటోకాల్ ప్రకారం.. ఎఐ-171కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎఎఐబికి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.

రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్ (విజయనగరం)

రైళ్ళలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా శుక్రవారం రాత్రి ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో స్థానిక పోలీసు, జిఆర్‌పి, ఈగల్, ఆర్‌పిఎఫ్ పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంజాయి ప్రధానంగా ఒడిస్సా నుంచి రైళ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా అవుతుందన్న సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ బృందం విజయనగరం రైల్వే స్టేషనులో ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్లో విశాఖపట్నం వరకు ప్రయాణించి, బృందాలుగా ఏర్పడి అన్ని భోగీల్లోను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి, అధికారులకు ప్రయాణికులతో వ్యవహరించాల్సిన తీరు గురించి విజయనగరం వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ ముందుగా వివరించి, వారు నిర్వర్తించే విధులు గురించి దిశా నిర్దేశం చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు, జిఆర్పి ఎస్ఐ మధుసూధనరావు, ఆర్.పి.ఎఫ్ ఎస్ఐ శ్రీధర్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, 40మంది పోలీసులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆ ఏనుగు దంతాలు ఎక్కడివి..?

- తెలంగాణ రాచకొండ పోలీసుల ముమ్మర దర్యాప్తు
- భాకరాపేట ఫారెస్ట్ కార్యాలయంలో పోయినవేనా?
- డిఎన్ఎ టెస్టుతో నిర్ధారణకు వచ్చే అవకాశం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం స్మగ్లింగ్ దశాబ్దాల తరబడి జరుగుతూనే ఉంది. గడిచిన 35 నుండి 40 సంవత్సరాల కాలంలో వేల టన్నులు ఎర్రచందనం శేషాచలం అడవుల నుండి స్మగ్లర్లు దోచుకెళుతున్నారు. వీరప్పన్ బ్రతికి ఉన్నప్పుడు ముమ్మరంగా వినిపించిన ఏనుగు దంతాల స్మగ్లింగ్ ఇప్పుడు శేషాచలం అడవులకు పాకిందా? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శేషాచలం అడవుల నుండి ఎర్రచందనంతో పాటుగా ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేసే ముఠాలు ఉన్నాయని ఇటీవల తెలంగాణ రాష్ట్రం ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలు సంఘటనతో వెలుగులోకి వచ్చింది. అయితే తెలంగాణలో పట్టుబడ్డ ఎర్రచందనం స్మగ్లర్ రేకులకుంట ప్రసాద్ వద్ద ఏనుగు దంతాలు పట్టుబడటంతో పలు కోణాలలో ఎల్బీనగర్ పోలీసులు విచారిస్తున్నారు. శేషాచలం అడవుల నుండి ఈ ఏనుగు దంతాలను అంతర్జాతీయ మార్కెట్లో రూ.3 కోట్ల రూపాయలకు విక్రయించడానికి రహస్యంగా తీసుకెళుతుండగా ఎస్ఓటి పోలీసులు అరెస్టు చేయడంతో ఒక్కసారిగా ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారులు ఉలిక్కిపడ్డారు. శేషాచలం అడవులలో ఎర్రచందనంతో పాటు వన్యప్రాణుల వేట అనేది తగ్గుముఖం పడుతున్న సమయంలో ఇలా ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేస్తున్నారన్న విషయంపై ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఉన్నత స్థాయి అధికారులు కూడా లోతైన దర్యాప్తును చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

వాస్తవానికి 2013 తలకోనలో..

శేషాచలం అటవీ పరిధి, తలకోనలో 2013 ప్రాంతంలో ఓ ఏనుగు మరణించడంతో దానిని గుర్తించిన అటవీశాఖ అధికారులు ఏనుగు కళేబరం నుండి దంతాలను వేరుచేసి భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో భద్రపరిచారు. ఆ సమయంలో ఏనుగు నుండి వేరు చేసిన ఆ దంతాల పొడవు, చుట్టుకొలత, బరువును రికార్డుల్లో నమోదు చేశారు. అయితే 2023లో భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో భద్రపరిచిన ఏనుగు దంతాలతో పాటుగా రెండు 12 బోర్ పంప్ గన్నులు అపహరణకు గురయ్యాయి. ఈ చోరీకి సంబంధించి భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో అటవీశాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో 87/2023 క్రైమ్ నెంబర్‌గా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తులో ఉండగానే 2025 జూన్ 25వ తేదీన ఎల్బీనగర్ పోలీసులకు రెండు ఏనుగు దంతాలు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి అన్నమయ్య జిల్లాకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ రేకులకుంట ప్రసాద్ దొరికాడు. వీటిని శేషాచలం అటవీ ప్రాంతం నుండి తీసుకొచ్చినట్లుగా తెలంగాణ పోలీసులకు ప్రసాద్ చెప్పాడు.

అవి.. ఇవి కాకపోతే.. అవి ఎక్కడివి..?

ఇటీవల అటవీశాఖ అధికారులు తెలంగాణ పోలీసులకు పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఇక్కడివి కావని దాటవేసే ప్రయత్నం చేశారు. అయితే తెలంగాణలో పట్టుబడ్డ ఏనుగు దంతాలు శేషాచలం ప్రాంతం నుండి అపహరించబడ్డ దంతాలు కాకపోతే తెలంగాణలో పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడినుండి వచ్చాయో నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసు అధికారులది. అదేవిధంగా అటవీశాఖ అధికారులపై ఉంది.

డిఎన్ఎ టెస్ట్ ద్వారా నిర్ధారణ..

తెలంగాణలో పట్టుబడ్డ ఏనుగు దంతాలు పోలీసు విచారణ అనంతరం రెండు రాష్ట్రాల పోలీసు, అటవీశాఖ ఉన్నతాధికారుల సమన్వయ నిర్ణయంతో తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారులకు పట్టుబడ్డ ఏనుగు దంతాలను అప్పగిస్తే 2007 జూన్ 6వ తేదీ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో ద్వారా ఏనుగు దంతాలకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించి ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

3డి టెక్నాలజీతో కృత్రిమ దంతాలు?

అంతర్జాతీయంగా ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేసే వారు కూడా పోలీసులను, అటవీశాఖ అధికారులను బురిడీ కుట్టించడానికి 3డి టెక్నాలజీతో తయారుచేసిన కృత్రిమ ఏనుగు దంతాలను పోలీసులకు అప్పజెప్పి దొడ్డి దారిన విదేశాలకు అసలు ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏనుగు దంతాల స్మగ్లింగ్ పై పూర్తిస్థాయి విచారణ జరిగితే తప్ప వాస్తవాలు వెలుగులోకి రాని పరిస్థితి ఏర్పడింది.

ఏనుగుల గుంపు హల్‌చల్..!

ప్రజాశక్తి - రామకుప్పం: చిత్తూరు జిల్లా రామకుప్పం మండల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతమైన చిక్కపల్లి తాండా పరిసరాల్లో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. రెండు గున్న ఏనుగులతో ఉన్న ఉన్న ఆరు ఏనుగుల గుంపు పలువురు రైతులకు చెందిన పంటపోలాలను నాశనం చేశాయి. నెలరోజులుగా ఒంటరి ఏనుగు ఇక్కడి అటవీ సరిహద్దు గ్రామాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తోంది. మరోవైపు ఆరు ఏనుగుల గుంపు పలు గ్రామాల పంటలపై పడి రైతులను, ప్రజలను బేంబేలెత్తిస్తుడటంతో ఏ రాత్రి, ఏ గ్రామం వైపు గజరాజులు తరలి వస్తాయోనని అటవీ సరిహద్దు గ్రామాల జనం హడాలిపోతున్నారు. ముఖ్యంగా అటవీ సమీపప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఆరు ఏనుగుల గుంపు నారాయణపురం తాండా అటవీ ప్రాంతంలోనీ చీకలగట్టు ప్రదేశంలో ఉన్నాయని, రామాపురం తాండా, నారాయణపురం తాండా, కోటచేను, నానియాల తాండా, జీడిమాకులపల్లె గ్రామ ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండి, రాత్రిలో ఎవరూ ఒంటరిగా పొలాలు దగ్గరకి, అడవిలోకి వెళ్ళవద్దని సూచించారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

- తెలుగు భాషా పరిరక్షణ సదస్సులో మాజీ ఐఎఎస్ ముక్తేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తెలుగు భాషను కాపాడుకుందామని, మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించే విధంగా కలిసికట్టుగా కృషి చేద్దామని నల్గొండ జిల్లా విశ్రాంత ఐఎఎస్ అధికారి ముక్తేశ్వరరావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు శనివారం స్థానిక సి.క్యాంప్‌లోని టిజివి కళాక్షేత్రంలో జరిగింది. ఈ సదస్సుకు కెసి కల్కూర అధ్యక్షత వహించారు. ముందుగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన తెలుగు భాషాభిమానులు కొండారెడ్డి బురుజు వద్ద తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్ మీదుగా టిజివి కళాక్షేత్రం చేరుకున్నారు. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు మాట్లాడుతూ... తెలుగు భాష గత వైభవం గురించి మాట్లాడడం లేదని, తెలుగు భాషకు జరిగే అపచారం గురించి ఆలోచించి మనం తీసుకోవాల్సిన చర్యలను చర్చించాలన్నారు. తెలుగు భాష అభిమానులు మేల్కొనకపోతే భవిష్యత్తులో తెలుగు మాట్లాడే వారే ఉండరన్నారు. ప్రస్తుతం జిఒలన్నీ ఆంగ్లంలోనే ఉన్నాయని, అధికార భాష ద్వారా అందరికీ అర్థమయ్యే రీతిలో ఉండాలని కోరారు. పురోహితంలో సైతం ఆంగ్లం వచ్చేసిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆంగ్లప్రదేశ్‌గా మారనుందని, అందరం చర్చించి మంచి సూచనలు, సలహాలు ఇచ్చి తెలుగు భాషను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు


ప్రజాశక్తి-రొద్దం

యూరియా కోసం శనివారం స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద రైతులు బారులు తీరి నిలబడ్డారు. సత్యసాయి జిల్లా రొద్దం పంచాయతీలో మూడు సచివాలయాలు ఉండగా వాటి పరిధిలో మూడు రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఆ మూడు కేంద్రాలు 1, 2 కిలోమీటర్ల దూరంలోనే ఉంటాయి. రొద్దం పంచాయతీలో 11 గ్రామాలు ఉండగా రెండు గ్రామాల రైతులకు మాత్రం అవి అందుబాటులో ఉంటాయి. మిగిలిన గ్రామాలకు దూరం కావడంతో రొద్దం రావాల్సిన పరిస్థితి. అంతేకాకుండా ఆదివారం సెలవు కావడంతో ఒక్కసారిగా వంద మందికి పైగా రైతులు యూరియా కోసం సొసైటీ వద్ద చేరుకొని అవస్థలు పడ్డారు. అందులో కూడా ఒక్కొక్కరికి 5 నుంచి 10 ప్యాకెట్లు కావాల్సి ఉండగా తక్కువ ఉన్నందున ఉదయం కొందరికి మాత్రం లభించాయి. అనంతరం మధ్యాహ్నం రెండు లారీల యూరియా రావడంతో రైతులు ఊపిరి పీల్చుకొన్నారు. మండలంలో ఎక్కువగా మొక్కజొన్న పంట సాగు చేస్తుండడంతో యూరియాకు బాగా డిమాండ్ ఏర్పడిందని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉగ్రవాదుల్లా పేట్రేగిపోతున్న వైసిపి

- మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ



వైసిపి నాయకులు ఉగ్రవాదుల్లా పెట్రేగిపోతున్నారని, నరకండి.. చంపండి.. అంటూ ఆ పార్టీ కార్యకర్తలను ప్రజలపైకి ఉసిగొల్పుతు న్నారని మంత్రి ఎస్.సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం శాశ్వతం కాదని గ్రహించని వైసిపి నాయ కులు జగన్ ఐదేళ్ల పాలనలో చట్టాలు, నిబంధనలను అతిక్రమించి అక్రమ సంపాదనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి అక్రమాలు బయటపడు తుండడంతో వారి వెన్నులో వణుకుపుడుతోంద న్నారు. జైలుకెళ్లాల్సి వస్తోందనే భయంతో కూటమి ప్రభుత్వం, అధికారులు, ప్రజలపై కక్ష పెంచుకున్నా రన్నారు. దళితుడైన సొంత పార్టీ కార్యకర్తను కారు కింద వేసి జగన్ తొక్కించారన్నారు. గోదాములో నిల్వ ఉంచిన 4 వేల రేషన్ బియ్యం బస్తాలను పేర్ని నాని మాయం చేశాడని, ఇదే విషయమై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. మరో వైసిపి మాజీ ఎమ్మెల్యే మహిళా ఎమ్మెల్యేను దూర్భాషలాడాడన్నారు. ఆ పార్టీ నాయకులు స్వార్ధ రాజకీయాల కోసం కార్యకర్తలనే పావులా వాడుకుం టున్నారని, జాగ్రత్తగా ఉండాలని వైసిపి కార్యకర్తల కు సూచించారు. వైసిపి నాయకులు ఎంత రెచ్చ గొట్టినా కూటమి శ్రేణులు వారి వలలో పడరని, సంయమనంతో ఉంటారని స్పష్టం చేశారు. ప్రజలు వైసిపి మాటలను పట్టించుకునే పరిస్థితుల్లో లేరని తెలిపారు.

హెచ్‌ఎల్‌సికి ఆగిన నీటి సరఫరా



- రెగ్యులేటర్ దింపిన అధికారులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అనంతపురం జిల్లాలోని బొమ్మనహాల్ సమీపం ఆంధ్ర సరిహద్దులో హెచ్ఎల్‌సి కాలువకు నీటి సరఫరా ఆగింది. 105 కిలోమీటర్ల వద్ద రెగ్యులేటర్లను అధికారులు కిందకు దించేశారు. తుంగభద్ర జలాశయం నుంచి ఈ నెల 10వ తేదీన హెచ్ఎల్‌సి కాలువకు నీటిని విడుదల చేశారు. ఆ నీరు శనివారం సాయంత్రం ఆంధ్ర సరిహద్దు బొమ్మనహాల్ ప్రాంతానికి రావాల్సి ఉంది. అయితే 105 కిలోమీటర్ల నుంచి ఆంధ్రాలో కాలువల మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ పనుల నేపథ్యంలో కర్ణాటక సరిహద్దులోనే అక్కడి అధికారులు నీటిని ఆపేశారు. నీరురాకపోవడంతో జిల్లా రైతులు తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్నారు. హెచ్ఎల్‌సి కాలువల మరమ్మతులకు సంబంధించి గుత్తేదారులు వారు తీసుకున్న పనులను నత్తనడకన చేస్తున్నారు. నీరు వచ్చే సమయానికి ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో పనులు పూర్తి కాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ప్రస్తుతం నీరు అందకుండా పోయాయి. ఈ నీరు వచ్చి ఉంటే పంటలు, తాగునీటికి ఉపయోగంగా ఉండేది. అనంతపురం జిల్లాకు తాగునీటి కోసం నెల రోజుల పాటు ఈ కాలువ ద్వారా నీటిని వదలాల్సి ఉంది. అనుకున్న సమయంలో నీరు రాకపోడంతో నెల రోజుల పాటు నీటి సరఫరా ఉంటుందా.. లేదా.. అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం చేస్తున్న పనులు పూర్తవడానికి ఇంకా 20 రోజులు సమయం పడుతుందని హెచ్ఎల్‌సి అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత నీటి విడుదల ఎలా ఉంటుందన్న అంశం అప్పటి పరిస్థితులను బట్టి ఉంటుంది. పనులు నెమ్మదిగా జరుగుతున్నా వాటిని వేగవంతం చేయించడంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చూపడంపై రైతుల నుంచి అసహనం వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను వేగవంతం చేయించి అనుకున్న సమయానికి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు

- ఎండిపోతున్న సుడులు

ప్రజాశక్తి - బనగానపల్లె (నంద్యాల)

మొక్కజొన్న పంటను కాండం తొలుచు పురుగు ఆశించింది. కాండం వద్ద పురుగు చేరి మొక్కను మేస్తుండడంతో సుడులు ఎండిపోతున్నాయి. ఫలితంగా మొక్కజొన్న పంట ఎదుగుదల లేకపోవంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె, మీరాపురం, పాతపాడు, జోలాపురం, చెర్లో కొత్తూరు, క్రిష్ణగిరి, పసుపుల, పెద్దరాజుపాలెం చిన్నరాజుపాలెం తదితర గ్రామాలలో నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటను కాండం తొలుచు పురుగు ఆశించడంతో మొక్క మధ్య భాగం ఎండిపోతుంది. ఆకులు పసుపు రంగులోకి మారిపోయి మొక్క చనిపోతుంది. ఎన్ని మందులు కొట్టినా తగ్గడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మొక్కజొన్న పంటకు కాండంతొలుచు పురుగు ఆశించినట్లు గమనిస్తే 30 రోజులలో పైరుకు ఎకరాకు మూడు కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను మొక్కజొన్న సుడులలో వేయాలి. దీనివల్ల మొక్క విషతుల్యమై పురుగు చనిపోతుంది. మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాండం తొలుచు పురుగు నివారణకు పొలంలో కలుపు, చెత్తా చెదారం లేకుండా జాగ్రత్త వహించాలి. పురుగు ఆశించిన మొక్కలను తొలగించాలి

- సి.సుబ్బారెడ్డి, మండల వ్యవసాయ అధికారి.

పేపరు మిల్లు లాకౌట్ ఎత్తివేత

- సమ్మె విరమించిన కార్మికులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని పేపర్‌మిల్లు యాజమాన్యం శనివారం సాయంత్రం లాకౌట్ ఎత్తివేసినట్లు ప్రకటించింది. దీంతో కార్మికులు సమ్మె విరమించారు. 47 మంది కార్మికులపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను యాజమాన్యం ఉపసంహరించుకుంది. వేతన ఒప్పందం విషయంలో ఈ నెల 16న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి సన్నాహకంగా ఆదివారం మధ్యాహ్నం రాజమహేంద్రవరంలో కార్మిక శాఖ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు, అడిషనల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, ఇతర అధికారులు యాజమాన్యం, యూనియన్ నాయకులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. లాకౌట్ ఉపసంహరణ, కార్మికుల సస్పెన్షన్ ఎత్తివేతపై సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ హర్షం వ్యక్తం చేశారు. సమస్యలపై సంఘటితంగా పోరాడిన కార్మికులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్మికులంతా ఐక్యంగా ఇదే పోరాట స్ఫూర్తితో వేతన ఒప్పందాన్ని సాధించుకునేంత వరకూ ఉద్యమించాలని ఆయన పిలుపు ఇచ్చారు.

ఆసియాకప్‌లో పాల్గొనం: పాకిస్తాన్

లాహోర్: పాకిస్తాన్ జూనియర్ హాకీ జట్టు భారత్‌లో జరిగే ఆసియాకప్, ప్రపంచకప్ టోర్నీలలో పాల్గొన కూడదని నిర్ణయించుకుంది. పాకిస్తాన్ ఫీల్డ్ హాకీ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. భద్రతా పరమైన సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది. ఈ పర్యటన అనుమతికి ప్రభుత్వాన్ని సంప్రదించగా.. దానికి ప్రభుత్వం అనుమతి నిరాకరించినట్లు ప్రభుత్వం పేర్కొన్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఆగస్టులో భారత్ వేదికగా ఆసియాకప్ టోర్నీ జరగనుంది.



సిమ్రన్‌కు స్వర్ణం

ముగిసిన పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు

బెంగళూరు: రెండ్రోజులపాటు శ్రీకంఠీరవ స్టేడియంలో జరిగిన ఇండియన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారంతో ముగిసాయి. చివరిరోజు హర్యానా, యుపి పారా అథ్లెట్ల హవా కొనసాగింది. మహిళల టి-12 200మీ. పరుగును ఉత్తరప్రదేశ్‌కు చెందిన సిమ్రన్ 24.80సెకన్లలో పూర్తిచేసి బంగారు పతకాన్ని సాధించగా.. దామోర్ తేజల్ అమరాజీ(గుజరాత్) 25.80సెకన్లు, జానకి ఓరం(ఒడిశా) 30.00సెకన్లు రజత, కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు. తొలిరోజు 100మీ. పరుగులో స్వర్ణ పతకం సాధించిన యుపికి చెందిన ప్రీతిపాల్.. రెండోరోజు 200మీ. టి-35 పరుగును 31.40సెకన్లలో పూర్తిచేసి మరో బంగారు పతకాన్ని ఒడిసిపట్టుకుంది. అవని(హర్యానా) 44.20సెకన్లు, సునేత్ర(రాజస్తాన్) 58.50సెకన్లు రజత, కాంస్యాలను సాధించారు.

ఇకపురుషుల ఫీల్డ్ ఈవెంట్‌లలో హర్యానా పారా అథ్లెట్ల హవా కొనసాగింది. క్లబ్ త్రో ఎఫ్32, ఎఫ్51లో ధరంబీర్ 30.37మీ. బెస్ట్ త్రో వేసి బంగారు పతకాన్ని సాధించగా.. ఆ రాష్ట్రానికే చెందిన ప్రణవ్ సూర్మా, అమిత్ కుమార్ రజత, కాంస్యాలను కైవసం చేసుకున్నారు. పురుషుల డిస్కస్ త్రో ఎఫ్-37లో హర్యానాకు చెందిన హనీ 53.81మీ. స్వర్ణ పతకం సాధించగా.. భవిష్య(హర్యానా), బాబీ(ఢిల్లీ) రజత, కాంస్యాలు సాధించారు.

ఈ పోటీల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలలనుంచి సుమారు 262మంది పారా అథ్లెట్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన పారా అథ్లెట్లు న్యూఢిల్లీ వేదికగా ఏడాది జరిగే ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనున్నారు.


మెరిసిన సురేఖ, ప్రీతికా

భారత్‌కు రజతం, కాంస్య పతకాలు



మాడ్రిడ్: స్పెయిన్ వేదికగా జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-4లో భారత మహిళల బృందం సత్తా చాటింది. జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్, ప్రీతికా ప్రదీప్‌లతో కూడిన త్రయం శనివారం జరిగిన కాంపౌండ్ టీమ్ ఈవెంట్లో రజతం సాధించారు. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సురేఖ గురి అదరడంతో కాంస్యం కూడా వచ్చి చేరింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 16 ఏళ్ల ప్రీతికా 2,116 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. దాంతో, భారత బృందం ఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే.. పసిడి పోరులో ఒత్తిడికిలోనై ఓటమిపాలైంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో చైనీస్ తైపీ బృందం 1,431 పాయింట్లతో వరల్డ్ రికార్డు స్కోర్‌తో స్వర్ణం ఎగరేసుకుపోయింది. అనంతరం జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో సురేఖ, రిషభ్ యాదవ్ ద్వయం పదో సీడ్ జంటను చిత్తు చేసి కాంస్యం అందించారు. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీఫైనల్లో మాత్రం భారత ఆర్చర్లు నిరాశపరిచారు. నెదర్లాండ్స్‌కు చెందిన 12వ సీడ్‌ల చేతిలో ఓటమిపాలయ్యారు.

నిరాశపరిచిన అవినాశ్ సెబ్లే



న్యూఢిల్లీ: మొనాకో డైమండ్ లీగ్‌లో భారత స్టీపుల్‌ఛేజర్ అవినాశ్ సెబ్లే నిరాశపరిచాడు. జంప్ చేసే క్రమంలో క్రిందపడి రన్నింగ్‌ను పూర్తి చేయడంలో విఫలమయ్యాడు. 30ఏళ్ల సెబ్లే సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ఇప్పటికే అర్హత సాధించాడు. 19మంది రన్నర్లతో కూడిన ఈ రేసులో మొరాకోకు చెందిన సౌఫియానే-ఎల్-బక్కాలి 8నిమిషాల 01.18సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానంలో నిలువగా.. ర్యాజీ మియురా(జపాన్) 8నిమిషాల 03:43సెకన్లు, ఎడ్మండ్ సెరిమ్(కెన్యా) 8నిమిషాల 04:00సెకన్ల రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఇక యువ స్ప్రింటర్ అనిమేశ్ కుజుర్ అండర్-23 200మీ. పరుగులో 4వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు.

కేరళ.. వలస కార్మికుల సంక్షేమ రాష్ట్రం

- వలస కార్మికుల చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేసిన తొలి రాష్ట్రం
- జెనీవా ఐఎల్‌ఓ సమావేశంలో పత్రం సమర్పించిన కేరళ ప్రణాళికా బోర్డు సభ్యులు రవి రామన్

జెనీవా : వ్యవస్థాగత, సంఘటిత కార్మిక సంక్షేమ చర్యలు చేపట్టడం, సర్వతోముఖాభివృద్ధిని సాధించడం ద్వారా కేరళ సంక్షేమ రాష్ట్రానికి, ముఖ్యంగా వలస వచ్చిన కార్మికుల సంక్షేమానికి ఒక ఉదాహరణగా నిలిచింది. ఈ నెల 2 నుండి 4వరకు జెనీవాలోని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ)లో 'రెగ్యులేటింగ్ ఫర్ డీసెంట్ వర్క్' అనే అంశంపై జరిగిన సమావేశంలో సమర్పించిన ఒక పత్రం ఈ అంశాన్ని పేర్కొంది. రాష్ట్ర ప్రణాళికా బోర్డు సభ్యుడు కె.రవి రామన్ ఈ పత్రాన్ని సమర్పించారు.

వలస కార్మికుల సంక్షేమ వ్యవస్థ దిశగా మరింత మెరుగైన ఆర్థిక, ద్రవ్య వ్యూహాన్ని రూపొందించే అవకాశాన్ని కూడా ఈ పత్రం సూచించింది. అలాగే ఈ వలస కార్మికుల కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించే అంశాన్ని కూడా ప్రస్తావించింది. ఈ కార్మికులకు గౌరవప్రదమైన పనిని కల్పించడానికి హామీ కల్పించడంతో సహా వారి జీవన పరిస్థితులను మెరుగ్గా వుండేలా చేయడానికి మరో ఐదేళ్ళపాటు వారి సంక్షేమ ప్రయోజనాలు కొనసాగించడానికి రాష్ట్రానికి అయ్యే వ్యయం రూ.454కోట్లుగా వుంటుందని కూడా ఆ పత్రం అంచనా వేసింది.

అంతరాష్ట్ర వలస కార్మికుల (ఉపాధి, పని పరిస్థితుల క్రమబద్ధీకరణ) చట్టం, 1979ని సంపూర్ణంగా అమలు చేసిన మొదటి రాష్ట్రం కేరళ అని రామన్ పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చిన కార్మికుల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా వారికి సమగ్ర సంక్షేమ ప్యాకేజీ అందచేయడం ద్వారా ఈ చట్టాన్ని పూర్తిగా అమలు చేశారన్నారు. వలస కార్మికుల సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం కార్మిక విభాగం, అలాగే కేరళ



బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుతో కలిసి సంయుక్తంగా దాన్ని అమలు చేస్తోంది. వలసకార్మికుల ఆరోగ్య, విద్యాపరమైన అవసరాలకు సాయమందించడం, ఒకవేళ చనిపోతే అందుకు సంబంధించిన ప్రయోజనాలు ఇవ్వడం, మృతి చెందిన కార్మికుడి భౌతిక కాయాన్ని స్వగ్రామానికి పంపించడం, శాశ్వత వైకల్యం పొంది, పనిచేయలేని పక్షంలో ఆ కుటుంబానికి ఆర్థిక సాయమందించడం, వైద్య ప్రయోజనాలు, ఒకవేళ పనినుండి తొలగిస్తే అందుకు సంబంధించిన భృతి, విద్యాపరమైన గ్రాంట్లు, ప్రసూతి లబ్ది ఇలా మొత్తంగా వారికి అవసరమైన సామాజిక భద్రతా చర్యలు తీసుకుంటోంది. కార్మిక విభాగం, సంక్షేమ బోర్డు, రాష్ట్ర ఆరోగ్య సంస్థ ఈ మూడు కలిసి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి.

వలస వచ్చిన కార్మికులు నెలకు దాదాపుగా రూ.4వేలు చొప్పున మిగులు ఆదాయం లేదా పొదుపు మొత్తాలు దాచుకోగలుగుతారు. పైగా ఇందులో దాదాపు 32శాతాన్ని అంటే ఏడాదికి రూ.30వేలకు పైగా మొత్తాన్ని స్వగ్రామంలోని కుటుంబాలకు పంపుతారు. ఇలాకేరళ నుండి ఇతర రాష్ట్రాలకు వార్షికంగా వెళ్లే మొత్తం దాదాపుగా రూ.7500కోట్ల నుండి రూ.8వేల కోట్ల వరకు వుంటుందని అంచనా.

వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, జనాభా మార్పులు, సంతానోత్పత్తి రేటులో మార్పులు ఇవన్నీ కూడా అంతరాష్ట్ర వలసలకు అత్యంత అనుకూలమైన ప్రాంతంగా కేరళ రాష్ట్రానికి ఆ హోదాను కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆ పత్రం పేర్కొంది. రాష్ట్రంలో వృద్ధులు అంటే ఏ పని చేయలేని వారి నిష్పత్తి దాదాపుగా14శాతం వుంది. అంటే జాతీయ సగటు 9శాతం కన్నా ఇది చాలా ఎక్కువ. అలాగే సంతానోత్పత్తి రేటు కూడా 1.5కి క్షీణించింది. అంటే రీ ప్లేస్‌మెంట్ స్థాయి కన్నా బాగా తక్కువ. ఈ పరిస్థితి స్థానికంగా కార్మికుల సంఖ్య క్షీణించడానికి దారి తీస్తోంది. కార్మిక శక్తిలో గణనీయమైన భాగం వుండే షెడ్యూల్డు కులాల్లో ఈ ధోరణి మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. దశాబ్ద కాలంలో రాష్ట్రంలో సగటు జనాభా వృద్ధిరేటు నెగిటివ్‌లోకి వెళుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాలు ఈ పరిస్థితికి చేరుకుంటున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

మరణ, సంతానోత్పత్తి రేటు ఒక నిశ్చల స్థాయికి చేరుకోవడంతో కార్మికుల కోసం కేరళ డిమాండ్ పెరుగుతునే వుంది. ప్రస్తుతం ఆ అవసరాన్ని, కొరతను అంతరాష్ట్ర వలస కార్మికులు తీరుస్తున్నారు. వారికి ఇవ్వజూపే వేతనాలు కూడా అధికమే. ఈ వేతనాలు అఖిల భారత సగటు రూ.417,3గా వుండగా, కేరళలో రూ.893.6గా వున్నాయి. అధిక సంతానోత్పత్తి గల, తక్కువ వేతనాలు కలిగిన ప్రాంతాల నుండి తక్కువ సంతానోత్పత్తి, అధిక వేతనాలు కలిగిన ప్రాంతాలకు సాధారణంగా వలసలు జరుగుతూ వుంటాయి. అయితే, ఇలా కార్మికులు వలసవచ్చే రాష్ట్రాల్లో కూడా సంతానోత్పత్తి రేట్లు క్షీణించడం, పెరుగుతున్న వేతనాల వల్ల కేరళకు సమీప భవిష్యత్తులో వచ్చే వలస కార్మికుల సంఖ్య తగ్గే అవకాశం వుందని రామన్ పేర్కొన్నారు.

న్యాయవాద వృత్తిలో ఎన్నో సవాళ్లు

- కోర్టుల తీర్పులపై సమగ్ర అవగాహన అవసరం
- జస్టిస్ బిఆర్ గవాయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకుందని, కోర్టుల తీర్పులపై న్యాయవాదులకు సంపూర్ణ అవగహన ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో శనివారం జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమానికి సిజెఐ బిఆర్ గవాయ్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. సామాజిక న్యాయంపై బలంగా దృష్టి సారించాలని న్యాయవాదులకు సూచించారు. వర్ణ వివక్ష సామాజిక వివక్షతల వంటి అణిచివేత వ్యవస్థలలో సవాల్ చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం న్యాయవాద విద్యలో ప్రవేశించేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందన్నారు. ఎఐ, డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే.. నైపుణ్యం సాధించగలరని తెలిపారు. న్యాయవాద వృత్తిలో మెంటార్‌షిప్‌ను ఒక బాధ్యతగా భావించాలన్నారు. వృత్తిని, చేసే పనిని ప్రేమిస్తేనే సరైన ఫలితాలు పొందగలుగుతామని వివరించారు. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయని, కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగడం ఆందోళనకరమని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పిఎస్ నరసింహ, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు బహుకరిస్తున్న సిజెఐ

జమ్మూకాశ్మీర్‌లో రోడ్డు ప్రమాదం

- ఐదుగురి మృతి

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం ఉఖ్రాల్ పోగల్ పారిస్తాన్ ప్రాంతంలోని సేనబాటి సమీపంలో ఒక కారు అదుపుతప్పి 600మీటర్ల లోయలో పడిపోయింది. ప్రయాణికుల్లో ఒకరైన తౌకీర్ అహ్మద్ (20) అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన మిగిలిన ఐదుగురిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికులు ముహమ్మద్ రఫీక్ (40), అబ్దుల్ లతీఫ్ (40), అజాజ్ అహ్మద్ (20) ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారు. ప్రయాణీకుడు షకీల్ అహ్మద్ (24) ఈ ఉదయం శ్రీనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. గాయపడిన యావర్ అహ్మద్ (25) పరిస్థితి విషమంగా ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి, మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయం అందిస్తామని కూడా వారు ప్రకటించారు. మతుల బంధువులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున సహాయం అందించనున్నట్లు రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ అలియాజ్ ఖాన్ తెలిపారు.

ఆగస్టు 1 నుంచి..
ఆ మూడు దేశాలపై 30 శాతం సుంకాలు : ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై మళ్లీ సుంకాల మోత మోగించారు. మెక్సికో, ఇయు దేశాల నుంచి నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై విధించిన 30 శాతం సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈ మేరకు ఇయు కమిషన్ అధ్యక్షులు ఉర్సులా వాండెర్ లెయెన్, మెక్సికో అధ్యక్షులు క్లాడియా షీన్‌బామ్‌లకు లేఖలు రాశారు.

అమెరికాలోకి అక్రమ వలసదారులను నిరోధించడంలో మెక్సికో సాయపడిందని క్లాడియాకు రాసిన లేఖలో ట్రంప్ అంగీకరిస్తూనే.. అమెరికాను నార్కో–ట్రాఫికింగ్ ప్లేగ్రౌండ్‌గా మారకుండా ఆపడానికి తగిన చర్యలు తీసుకోలేదన్నారు. సరిహద్దును రక్షించుకోవడంలో మెక్సికో చేస్తున్న సాయం తగినంతగా లేదన్నారు. అలాగే, ఉర్సులాకు రాసిన లేఖలో.. అమెరికా వాణిజ్య లోటు జాతీయ భద్రతకు ముప్పుగా ఉందని పేర్కొన్నారు.

కాగా, కెనడా నుంచి దిగుమతయ్యే సరకులపై విధించిన 35 శాతం సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. 20 నుంచి 50శాతం వాణిజ్య సుంకాలు విధిస్తామని పేర్కొంటూ బ్రెజిల్, జపాన్ వంటి 23 దేశాలకు ట్రంప్ ఇటీవల ఇటువంటి లేఖలు పంపిన సంగతి తెలిసిందే.

బాలికపై హత్యాచారం..

- దోషికి బహిరంగ మరణశిక్ష

టెహ్రాన్ : బాలికను హత్యాచారం చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈ విషయాన్ని ఇరాన్ స్థానిక మీడియా సంస్థలు వెల్లడించాయి. సంస్థల నివేదికల ప్రకారం.. బుకాన్‌కు చెందిన ఓ బాలికను అత్యాచారం, హత్య చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని బాధిత కుటుంబసభ్యులు, ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా.. సుప్రీంకోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్లు చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు. ఇరాన్‌లో బహిరంగంగా మరణశిక్షలు విధించడం సాధారణమే. హత్య, అత్యాచారం వంటి తీవ్రత ఎక్కువున్న కేసుల్లో ఇలాంటి కఠినమైన శిక్షలను అమలుచేస్తారు. మానవ హక్కుల సంఘాల ప్రకారం.. ప్రపంచంలో ఎక్కువ మరణశిక్షలు అమలుచేసే దేశాల్లో ఇరాన్ రెండో స్థానంలో ఉంది.

ఆహారం కోసం వచ్చి మృత్యువు ఒడి చేరి... !

- రేషన్ కేంద్రం వద్ద దాడుల్లో 30మంది మృతి, 130మందికి పైగా గాయాలు
- గాజాలో తాజా దాడుల్లో 71మంది మృతి

గాజా : ఆహారం కోసం వేచి వున్న వారిపై కూడా కనికరం లేకుండా కర్కశంగా దాడులు జరుపుతున్న ఇజ్రాయిల్ మిలటరీ తాజాగా జరిపిన దాడుల్లో 30మంది మరణించారు. 130మందికి పైగా గాయపడ్డారు. దక్షిణ గాజాలో జిహెచ్‌ఎఫ్ నిర్వహిస్తున్న వాటిలో మిగిలివున్న ఒకే ఒక ఆహారం పంపిణీ కేంద్రం వద్ద ఈ దాడులు జరిగాయి. తమ వంతు ఆహారం కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న వారిపై విచక్షణరహితంగా ఆర్మీ దాడులు జరిపిందని మీడియా వర్గాలు తెలిపాయి. ఆహారం కోసం అల్లాడుతున్న అనేక కుటుంబాలు ఉత్తర ప్రాంతంనుండి అత్యంత ప్రమాదకరమైన ప్రయాణాలు చేసి రఫాలోని ఈ ఆహార పంపిణీ కేంద్రానికి వచ్చి, ఇక్కడ ప్రాణాలు పోగొట్టుకున్నారని మీడియా వర్గాలు తెలిపాయి. ఇంకా అనేక మృత దేహాలు నేలపై చెల్లాచెదురుగా పడి వున్నాయి. దీంతో మొత్తంగా శనివారం తెల్లవారు జాము నుండి గాజాలో ఇజ్రాయిల్ ఆర్మీ సాగిస్తున్న దాడుల్లో 71మంది పాలస్తీనియన్లు మరణించారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. శుక్రవారం కూడా గాజాలోని రేషన్ కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. నిన్నటి దాడుల్లో 10మంది చనిపోయారు. దీంతో గత ఆరు వారాల్లో ఇలా ఆహార కేంద్రాల వద్ద జరిపిన దాడుల్లో 800మంది వరకు మరణించారని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. సుదీర్ఘంగా గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో ఇప్పటివరకు 57,882మంది పాలస్తీనియన్లు మరణించగా, 1,38,095మంది గాయపడ్డారు. గతంలో ఐక్యరాజ్య సమితి ఆహార పంపిణీని నిర్వహించేటపుడు 400కి పైగా కేంద్రాలు వుండేవి. దానికి భిన్నంగా గాజావ్యాప్తంగా కేవలం నాలుగు పంపిణీ కేంద్రాలు మాత్రమే నడుస్తున్నాయి. దీనికి తోడు బుధవారం ఖాన్‌యూనిస్‌లోని కేంద్రాన్ని మరమ్మత్తుల కోసం మూసివేస్తున్నామని జిహెచ్‌ఎఫ్ ప్రకటించింది. దీంతో ఈ ఏరియాలో రఫాలో కేంద్రం ఒక్కటే అయింది.

దాడులకు సంబంధించి తమ బలగాలకు కొత్త ఆదేశాలు జారీ చేసినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. గత రెండు రోజుల్లో గాజాపై 250సార్లకు పైగా దాడులు చేసినట్లు ఆర్మీ ప్రకటించింది.

మరోవైపు కతార్‌లో కాల్పుల విరమణపై జరుగుతున్న చర్చలు స్తంభించాయి. గత ఆదివారం నుండి ఇరు పక్షాల ప్రతినిధి బృందాలు ఇక్కడే వున్నాయి. అయితే 60రోజులపాటు కాల్పుల విరమణ జరగాలన్న అమెరికా ప్రతిపాదన ప్రాతిపదికగా ఒప్పందం కుదుర్చుకోవడంలో తాజాగా అడ్డంకులు ఎదురైనప్పటికీ పరోక్ష చర్చలు కొనసాగుతాయని భావిస్తున్నారు. ఇజ్రాయిల్ ప్రతిపాదించిన ఉపసంహరణ మ్యాప్‌లను హమాస్ ఆమోదించదని పాలస్తీనా వర్గాలు తెలిపాయి. ఈ ప్రతిపాదన ప్రకారం దాదాపు 40శాతం భూభాగాన్ని ఇజ్రాయిల్‌కు వదిలిపెట్టాల్సి వుంటుంది. అందులోనే రఫా, ఉత్తర, తూర్పు గాజాల్లోని ప్రాంతాలు వున్నాయి. అలాగే సహాయం, ఇతర హామీలకు సంబంధించిన అంశాలు కూడా సవాలుగా మారాయి. గతంలో కాల్పుల విరమణ జరిగినపుడు ఇజ్రాయిల్ బలగాలు ఏ పరిధి వరకు వెనక్కి మళ్ళాయో ఇప్పుడు కూడా అలాగే వెళ్లాలని హమాస్ కోరుతోందని చెప్పారు.

ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు తాళలేక
కాలేజీలోనే నిప్పంటించుకున్న విద్యార్థిని

భువనేశ్వర్ : ఒడిషాలో ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు భరించలేని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యి, న్యాయం జరగడం లేదనే ఆవేదనతో కాలేజీ ప్రాంగణంలోనే పెట్రోల్ పోసుకొని శనివారం నిప్పంటించుకుంది. దీంతో 90శాతం కాలిన గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన తోటి విద్యార్థి మంటలంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో బాధిత విద్యార్థిని ఇంటిగ్రేటెడ్ బీఈడీ రెండో సంవత్సరం చదువుతోంది. ఓ విభాగాధిపతి సదరు విద్యార్థినిని కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనమాట వినకుంటే భవిష్యత్తు నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి భరించలేని ఆ విద్యార్థిని జూన్ 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. వారంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిని రక్షించే ప్రయత్నం జరుగుతోందని, తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా కాలేజీ క్యాంపస్‌లో నిరసన చేపట్టింది. శనివారం ఉదయం కూడా తోటి విద్యార్థులతో కలిసి కాలేజీ ముందు ఆందోళనకు దిగి, ప్రిన్సిపల్ కార్యాలయానికి ఒక్కసారిగా పరుగెత్తింది. పెట్రోల్ పోసుకొని ఒంటికి నిప్పంటించుకుంది. హాహాకారాలతో పరుగెత్తుతుండగా తోటి విద్యార్థులు ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. వేధింపులపై విద్యార్థిని ఫిర్యాదు చేసిందని, దీనిపై అంతర్గత కమిటీ దర్యాప్తు చేపడుతోందని కాలేజీ ప్రిన్సిపల్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. హెచ్‌వోడీని అదుపులోకి తీసుకున్నారు. తాజా పరిణామంతో కాలేజీ క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

ప్రజాభిప్రాయ సేకరణ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ ఒక పద్ధతి ప్రకారం చేయకుండా దానిని తారుమారు చేసి పివిటిజి గిరిజనుల పొలాల్లోంచి పైపులైన్ వేయడం వల్ల తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. సీలేరులోని ఎపి జెన్‌కో జల విద్యుత్ కేంద్రాలు, నూతనంగా నెలకొల్పుతున్న పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులో గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం పరిధిలోని పివిటిజిల గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేవని, ఈ గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతులు లేక ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంత సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా నివేదిస్తానని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రజలను మూలకు నెట్టకుండా గ్రామసభలు నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు అశోక్, సిఐటియు రంపచోడవరం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా నాయకులు చింతా రాంబాబు, సీలేరు ఏరియా కమిటీ కార్యదర్శి ఎస్‌కె.సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరికి వరద ఉధృతి

(మొదటిపేజీ తరువాయి)

ఆనకట్ట వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. సీలేరు జలాలతో కలిపి ఎగువ ప్రాంతాల నుంచి 5,43,409 క్యూసెక్కుల వరద నీరు గోదావరిలో చేరుతోంది. ఆదివారం ఉదయానికి ధవళేశ్వరం ఆనకట్ట వద్ద వరద ఉధృతి అధికమవుతుందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేశారు. తొమ్మిది లక్షల నుంచి పది లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద పది లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

స్తంభించిన రాకపోకలు

ఏలూరు జిల్లా దాచారం, కుక్కునూరు మధ్య గుండేటి వాగు కాజ్‌వేపైకి వరద నీరు చేరడంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు రెండు రోజులుగా స్తంభించాయి. వరద ఉధృతి పెరుగుతుండడంతో గొమ్ముగూడెంలోని 253 కుటుంబాలకుగానూ వంద కుటుంబాలు రావికుంట పునరావాస కేంద్రానికి తరలివెళ్లాయి. గొమ్ముగూడెం, దాచారంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని శనివారం జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి పర్యవేక్షించారు. వేలేరుపాడు మండలం రుద్రమకోట, రేపాకగొమ్ము, తాట్కూర్‌గొమ్ము గ్రామాల్లోని సుమారు 50 కుటుంబాలు ముందు జాగ్రత్తగా తమ సామగ్రితో భూదేవిపేట, అశ్వారావుపేట, ఆసుపాక, నెమలిపేట ఆర్ అండ్ ఆర్ కాలనీలకు తరలిపోయాయి. సహాయ, పునరావాస కార్యక్రమాలను జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి ఆర్.విజయరాజు పర్యవేక్షించారు. అనంతరం వేలేరుపాడు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ రమణ అధికారులతో సమావేశం నిర్వహించారు. పునరావాస కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.

వరద పునరావాస శిబిరాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 7,43,222 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.430 మీటర్లు, దిగువన 22.600 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 31.900 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 22,050 మీటర్లు, ఎగువ దిగువ కాఫర్ డ్యాం మధ్య 16.080 మీటర్లు, ప్రాజెక్టు దిగువన 10.78 మీటర్లు నీటిమట్టం నమోదైందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. పట్టిసీమ శివక్షేత్రాన్ని వరద జలాలు చుట్టుముట్టాయి.


టిటిడి అధికారులతో సమీక్షలో పాల్గొన్న మంత్రి ఆనం, పక్కన టిటిడి చైర్మన్, ఇఒ తదితరులు

590 మంది వేదపండితులకు నిరుద్యోగ భృతి

- కామన్ గుడ్‌ఫండ్ మరో నాలుగు శాతం పెంపు
- టిటిడిలో హిందూయేతరులపై విచారణ
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - తిరుమల

రాష్ట్రంలో 590 మంది వేదపండితులు నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి రూ.మూడు వేలు భృతి ఇవ్వాలని నిర్ణయించినట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. దేవదాయశాఖ, టిటిడి మధ్య పెండింగ్‌లో ఉన్న సంయుక్త అంశాలపై శనివారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ జె.శ్యామలరావు, దేవాదాయ శాఖ కార్యదర్శి వినయ్‌చంద్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. గతంలో సిఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన సమావేశంలో ఆలయాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముందుకు రాగా వాటి పైన ఈ సమావేశంలో చర్చించామన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్ నిర్మాణంలో ఉన్న ఆలయాలకు రూ.147 కోట్లు విడుదల కాగా నిలిచిపోయాయని, మరో రూ.11 కోట్లు మిగతా ఆలయాలకు రావాల్సి ఉందని పేర్కొన్నారు. విజయవాడ దుర్గగుడికి వెళ్లేందుకు మరో రోడ్డు మార్గం వేసేందుకు టిటిడి సహకారం కావాలని కోరారు. టిటిడిలో హిందూయేతరులు ఉన్నారన్నది వాస్తవమని, కేంద్ర మంత్రి బండిసంజయ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ కొనసాగుతుందని తెలిపారు. టిటిడి కాలేజీ, పాఠశాలల్లో ఉన్న 192 పోస్టులను ఒప్పంద ఉపాధ్యాయులతో భర్తీ చేసేందుకు చర్చించినట్లు వెల్లడించారు. టిటిడి నుంచి కామన్ గుడ్‌ఫండ్‌ను ఐదు నుంచి తొమ్మిది శాతానికి పెంచినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్. వెంకయ్య చౌదరి, జెఎఇ వీరబ్రహ్మం, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, టిటిడి చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణ, దేవాదాయ శాఖ ఉపకార్యదర్శి సుధాకర్ రావు, ఎపి దేవాదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ జివిఆర్.శేఖర్ పాల్గొన్నారు.

కారుడ్రైవర్ దారుణహత్య

- జనసేన నాయకుల ఘాతుకం
- సూత్రధారులుగా శ్రీకాళహస్తి ఇన్‌చార్జి దంపతులు
- విచారిస్తున్న తమిళనాడు పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటా వినుత వ్యక్తిగత సహాయకుడు సిహెచ్ రాయుడు అలియాస్ శ్రీనివాసులు (22) దారుణహత్యకు గురైన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమిళనాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాయుడు గత 15 సంవత్సరాలుగా వినుత దంపతుల వద్ద కారు డ్రైవరుగా, వ్యక్తిగత సహాయకుడిగా పని చేస్తున్నారు. అయితే గత నెల 22న రాయుడికి, జనసేన పార్టీకి ఇకపై ఎలాంటి సంబంధం లేదనీ, పార్టీ విద్రోహ చర్యల కారణంగా ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు వినుత అధికారిక ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో రాయుడు గత పది రోజుల కిందట అదృశ్యమయ్యాడు. అనంతరం ఈ నెల 8న కూవం నదిలో శవమై కనిపించాడు. వేలా అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు మృతుడి శరీరంపై ఉన్న ట్యాటూ, కత్తిపోట్ల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. సిసిపుటేజీ ఆధారంగా కారు వివరాలు రాబట్టడంతో నిందితులను పట్టుకోగలిగారు. వినుత భర్త ప్రోత్సాహంతో జనసేన కార్యకర్తలు కావలి శివకుమార్ (36), షేక్ తాషన్ (28), గోపి(24)లు హత్య చేసి ఆ తరువాత కారులో చెన్నై తీసుకొచ్చి కూవం నదిలో పడేశారు. విచారణలో భాగంగా వినుత, ఆమె భర్త చంద్రబాబులతో పాటు శివకుమార్, షేక్ తాషన్, గోపీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివాహేతర సంబంధం, పార్టీ విద్రోహ చర్యల కారణంగా హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.


వినుతతో మృతుడు శ్రీనివాసులు (ఫైల్)

పార్టీ నుంచి సస్పెండ్ చేసిన జనసేన

రాయుడు హత్య కేసులో చిక్కుకున్న కోటా వినుతను ఆ పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. పార్టీ విధి విధానాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు ఆ పార్టీ నేత వేములపాటి అజయ్ కుమార్ ప్రకటించారు.

బనకచర్లకు ఏదీ మార్గం?

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టు అథారిటీ డైరక్టర్ మన్ను జి. ఉపాధ్యాయ ఇటీవల కేంద్ర జలసంఘానికి లేఖ రాశారు.

అధికారులు ఏమంటున్నారు?

'పోలవరం ప్రాజెక్టు మొదటి దశే ఇంకా పూర్తి కాలేదు. రెండేళ్లలో పూర్తవుతుందని అనుకుంటున్నా ఖచ్చితంగా అవుతుందని చెప్పలేం. మొదటి దశ పూర్తయితేకాని, రెండవ దశకు అనుమతి అంశం ప్రస్తావనకు వస్తుంది. ఒకవేళ ఇప్పుడు అనుమతించినా ప్రాజెక్టు చేపట్టి, పునరావాసం పునర్నిర్మాణం ఇతర అంశాలన్నీ పూర్తి చేయాలంటే ఎప్పటి కవుతుందో చెప్పలేం. ఇది బనకచర్ల ప్రాజెక్టును సత్వరమే చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధం. మరో మాటలో చెప్పాలంటే బనకచర్ల ప్రాజెక్టు ఉనికిలోకి రావడమే ప్రశ్నార్థకం అవుతుంది' అని నీటి పారుదల శాఖలోని అధికారులతో పాటు, నిపుణులు అంటున్నారు.

ప్రత్యామ్నాయాలు లేవా..?

కేంద్ర ప్రభుత్వ వైఖరి నేపథ్యంలో కొన్ని ప్రత్యామ్నాయాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. తాటిపూడి లిఫ్టు కాలువలను పోలవరం కుడికాలువకు సమాంతరంగా విస్తరించడం వీటిలో ఒకటి. దీనివల్ల గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న ప్పటికీ, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని చెబుతున్నారు. గోదావరి జలాల వివాదాలను పరిష్కరించి అధికారికంగా నీటి పంపిణీ చేయడం మరో మార్గం. ఇది జరగాలంటే సాంకేతికంగా ఇప్పుడున్న ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్నవి, గతంలో ప్రతిపాదించి అనుమతి పొందిన ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు తీసుకోవాలి. గోదావరి జలాలపై సాంకేతిక అధ్యయనం కూడా ఇంతవరకు జరగలేదు. ఒడిస్సా, ఛత్తీస్‌ఘర్ మధ్య వివాదాలను పరిష్కరించి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు పంపిణీ చేయడం అంత సులభం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వరద జలాలే లక్ష్యంగా


గోదావరిలో నికర జలాల అంశం ప్రస్తావించడంతో పాటు, వరద జలాలను మాత్రమే తాము వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రానికి చెప్పనున్నట్లు తెలిసింది. గోదావరినుండి 3వేల టిఎంసిల నీరు ప్రతి ఏడాది సముద్రంలో వృద్ధాగా కలుస్తుందని వివరించడంతో పాటు, దానికి సంబంధించిన పూర్తి స్థాయి గణాంకాలను అందించనున్నారు. పోలవరం దగ్గర లభ్యమయ్యే గోదావరి జలాలనేతాము వాడుకుంటామని, బనకచర్ల ప్రాజెక్టుకు 200 టిఎంసిల నీరు మాత్రమే అవసరమవుతుందని సిఎం వివరించనున్నట్లు తెలిసింది.

సిఎం పర్యటన ఇలా...

15, 16 తేదీల్లో ముఖ్యమంత్రి ఢిల్లీలో జలశక్తిశాఖ మంత్రిని కలవనున్నారు. కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షా, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వనీ వైష్ణవ్, సిఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి అయోగ్ సభ్యులు వికె సారస్వత్‌లో కలిసి పలు అంశాలపై చర్చించనున్నారు. 16వ తేదీన జలశక్తిశాక మంత్రి సిఆర్‌పాటిల్‌ను కలిసి బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం చెప్పనున్నారు.రెండు రోజుల పర్యటనలో పి.వి.నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో సిఎం రెండోరోజు సిఐఐ నిర్వహించే బిజినెస్ సమ్మిట్‌కు హాజరవుతారు.



కష్ట పడితేనే ఫలితం



గంగాపురంలో నివసించే రంగయ్య సోమరిపోతు. 'కష్ట పడకుండా కడుపు నిండి పోవాలనుకుంటాడు. ఒకరోజు 'ఇంట్లో సరుకులన్నీ నిండుకున్నాయి. గంజి కాచుకోవడానికి కూడా తిండి గింజలు లేవ'ని భార్య బాధ పడింది. ఊరి చివర కొండ మీద మహిమ గల ఆకుపచ్చరాయి ఉంటుందని ఆ ఊర్లో ఎప్పటి నుండో ఓ పుకారు ఉంది. ఆ మహిమ గల రాయిని ఎలాగైనా దక్కించుకుని కోరినవన్నీ ఉన్నచోటుకే తెప్పించుకోవాలని రంగయ్య కొండ ఎక్కాలని నిర్ణయించుకుని, ఇంటి నుంచి బయటికి వచ్చాడు.

కొండ ఎక్కడం ప్రారంభించిన రంగయ్యకి అక్కడే ఉన్న ఒక ముసలి గొర్రెల కాపరి కనిపించాడు. అతన్ని అడిగి ఆ రాయి ఉన్న చోటుకి వెళ్లామనుకున్నాడు. 'మహిమ గల ఆకుపచ్చ రాయి ఉండే చోటు చూపించమ'ని తాతని అడిగాడు. రంగయ్య స్వభావం ఆ తాతకి అర్థమైంది.

'కొండ పైకి చేరితే అక్కడ చాలా నల్ల రాళ్లు ఉంటాయి. అవన్నీ చిన్నగా ఉంటాయి. వాటి మధ్యలోనే నువ్వు వెతుకుతున్న ఆకుపచ్చని రాయి, మెరుస్తూ ఉంటుంది. అయితే కాళ్ళు తగలగానే, ఆ కనిపించే నల్లని రాళ్లు, రెట్టింపుగా పెరిగి పోతాయి. చేతి వేళ్ళు తగిలితేనే అవి మాయం అవుతాయని విన్నాను. కాబట్టి నువ్వు పైకి వెళ్లి ఆ నల్లని రాళ్లని చేతుల్తో ఎత్తి పారబోయి. అప్పుడు వాటి మధ్యలో నువ్వు వెతుకుతున్న ఆకుపచ్చ రాయి దక్కుతుంది' అని చెప్పాడు.

తాత చెప్పినట్లుగా రంగయ్య ఆవైపు వెళ్లాడు. అక్కడ చిన్న చిన్న నల్లని రాళ్లు చాలా కనిపించాయి. వాటిలో ఎక్కడ కాలు వేస్తే అక్కడ మరింత లోతుకి కాలు దిగబడిపోతోంది. ఆ రాళ్లల్లో ఆకుపచ్చరాయిని వెతకాలంటే నడుం వంచి చేతుల్తో వాటిని పక్కకి పారబోయాలి. కష్టపడడం ఏమాత్రం ఇష్టం లేని రంగయ్య, చాలాసేపటి వరకు అటూఇటూ ఆ నల్లని రాళ్లల్లోనే నడిచాడు.

అప్పుడే గొర్రెల కాపరి తాత అటువైపు వచ్చాడు. రంగయ్యని చూసి, 'చూడు బాబు.. నీకు ఎవరు చెప్పారో గానీ ఇక్కడ ఏ మహిమ గల రాయీ లేదు. రోజంతా కష్టపడి పనిచేసేవాడు ఇలాంటి రాళ్ల కోసం ఆశపడడు. శ్రమతోనే సంపద సృష్టించుకోవాలనుకుంటాడు. ఆ సత్యం నువ్వు గ్రహించనంత కాలం, ఇదిగో ఇలాగే ఈ రాళ్ల మధ్య లేని ఆకుపచ్చ రాయి కోసం వెతుకుతూనే ఉంటావు' అని చెప్పాడు. రంగయ్యకి తాత మాటలు బాగా అర్థం అయ్యాయి. తన తప్పు తెలుసుకుని, ఆ రోజు నుండి కష్టపడి పనిచేయడం మొదలుపెట్టాడు.



- మోటూరి రోహిత శ్రీలక్ష్మీ దుర్గ,
5వ తరగతి
మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల,
నల్ల చెరువు, అయినవిల్లి మండలం,
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
కోనసీమ జిల్లా.

నేను గీసిన బొమ్మ



కోడ వరం,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ముత్యాల పేట,
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

తాము చేసే పొరపాట్ల నుంచే కాదు, ఇతరుల వైఫల్యాల నుంచి కూడా పాఠాలు నేర్చుకోవడం వివేకవంతుల లక్షణం.

మీ కోసం

పళ్లు శుభ్రంగా, తెల్లగా ఉండాలంటే వారానికోసారి ఉప్పుతో గాని, బేకింగ్ పాడర్‌తో గాని తోముకోవాలి.



JEEVANA జీవన the family

కన్న ప్రేమని చంపేసిన అహం..

వంటగదిలో వంట చేస్తున్న రాధికపై ఆమె తండ్రి వెనుక నుండి ఐదు రౌండ్ల కాల్పులు జరిపాడు. ఆ సమయంలో తల్లి ఇంట్లోనే ఉంది. జులై 10న ఉదయం 10:30 సమయంలో ఈ సంఘటన జరిగింది. రక్తపు మడుగులో పడి ఉన్న రాధికని ఆ క్షణం చూసిన ఆ తండ్రి ఏం అనుకుని ఉంటాడు? ఎంతో భవిష్యత్తు ఉన్న దేశం గర్వించదగ్గ టెన్నిస్ క్రీడాకారిణి, 25 ఏళ్ల ముక్కుపచ్చలారని రాధికపై తండ్రి, అంత ద్వేషం పెంచుకునేలా చేసిన పరిస్థితులు ఏంటి?

కారణాలు ఏవైనా, ఎంత బలమైనవి అయినా, ఆమె అతని కూతురే అయినా, ఆమె కూడా తన ఇష్టాలు, అయిష్టాలు, కోరినది ఎంచుకునే స్వేచ్ఛ కలిగిన పౌరురాలు. తండ్రి ఆమె నిర్ణయాలతో విభేదిస్తే, ఆమెకి జీవించే హక్కు లేదని అర్థమా? ఈ మనస్తత్వం అనాగరికం. ఇలాంటి ద్వేషంతో వ్యవహరించే వారెవరైనా జవాబుదారీతనంగా ఉండాలి.

రాధిక రాష్ట్రస్థాయి టెన్నిస్ క్రీడాకారిణి. భుజం గాయం కారణంగా కెరియర్‌కి దూరమైంది. అయినా తన కలని సాకారం చేసుకోవాలని మరికొంతమందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం పెట్టుకుంది. టెన్నిస్ అకాడెమీ ప్రారంభించి తన సొంతకాళ్లపై నిలబడింది. తన ప్రయాణాన్ని సోషల్ మీడియా ఖాతాలో ప్రచారం చేసింది. స్ఫూర్తివంతమైన రాధిక ప్రయాణం ఎంతోమందిని అనుసరించేలా చేసింది. లక్షల్లో ఆమె ఫాలోవర్స్ ఉన్నారు. అకాడెమీ బాగా రాణిస్తోంది. ఈ పరిస్థితే తండ్రి దీపక్ యాదవ్‌కి నచ్చలేదు. 'కూతురు సంపాదన మీద తండ్రి బతుకుతున్నాడు' అని చుట్టుపక్కల వాళ్లు అంటున్నారని తీవ్రంగా కలత చెందాడు. అకాడెమీ మూసేయమని ఎన్నోసార్లు చెప్పాడు. రాధిక ఒప్పుకోలేదు. తండ్రీ, కూతుళ్ల మధ్య ఈ విషయమై ఎన్నో వాద ప్రతివాదాలు జరిగాయి. కూతురు తను చెప్పిందానికి ఒప్పుకోవడం లేదన్న అహం ఆ తండ్రిని తీవ్రంగా దెబ్బతీసింది. కట్టలు తెచ్చుకున్న ఆగ్రహంగా అది బయటికి వచ్చింది. అంతే.. వెనుకాముందు చూడకుండా రాధికపై అదేపనిగా కాల్పులు జరిపాడు. బుల్లెట్ల దాడికి రాధిక అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు ఒదిలింది.

'మహిళలు విజయం సాధించడం ప్రారంభించినప్పుడు, అది వారి ప్రతిభని ప్రదర్శించడం లేక స్వతంత్రంగా సంపాదించడం అయినా మగ కుటుంబ సభ్యుల సున్నితమైన అహాన్ని దెబ్బతీస్తుంది. తండ్రులు, సోదరులు, భర్తల రూపంలో మహిళలపై వేధింపులు మొదలవుతాయ'ని ఢిల్లీకి చెందిన మానసిక శాస్త్ర నిపుణురాలు మోనికా శర్మ వ్యాఖ్యలు ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

ఈ ధోరణి దేశం అంతటా, గురుగ్రామ్ నుండి బీహార్ వరకు, కోల్‌కతా నుండి పంజాబ్ వరకు వ్యాపించింది.

పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని, సమాజంలో వారిని గౌరవప్రద స్థానంలో ఉంచాలని తల్లిదండ్రులు నిరంతరం తపిస్తారు. పిల్లలు ఎక్కడా నొచ్చుకోకూడదని ఎన్నో త్యాగాలు చేస్తారు. శక్తికి మించిన స్కూళ్లు, కాలేజీల్లో చదివిస్తారు. పిల్లలపై ఎంతో ప్రేమానురాగాలు పంచుతారు. ఇన్ని చేసిన తల్లిదండ్రులు పిల్లలకు కొన్ని వ్యక్తిగత ఆలోచనలు, ఆకాంక్షలు ఉంటాయని గ్రహించడం లేదు. సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ వారికి ఉందని అర్థం చేసుకోవడం లేదు. తాము చెప్పిన మాట వినడం లేదని, నచ్చని పని చేస్తున్నారని, ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారని, అప్పటి వరకు పిల్లలపై పెంచుకున్న ప్రేమ, విషంగా, విద్వేషంగా మారుతోంది. అది హద్దులు దాటి కన్నబిడ్డల పాలిట మృత్యువై కబళిస్తోంది. ఒకప్పుడు ప్రేమ వ్యవహారం ఈ వరుసలో ముందు ఉంటే ఇప్పుడు కెరియర్ ఆ స్థానాన్ని ఆక్రమించింది. తాజాగా హర్యానాలో టెన్నిస్ కోచ్ రాధికా యాదవ్‌ని ఆమె తండ్రే తుపాకీతో కాల్చి చంపిన ఉదంతం మరోసారి ఈ అంశంపై చర్చకి దారితీస్తోంది.

బాధితులైన మహిళలు చట్టాన్ని ఉల్లంఘించినందుకు శిక్షలు అనుభవించలేదు. మౌనాన్ని బద్దలు కొట్టినందుకు హింసను ఎదుర్కొన్నారు. ఇన్‌స్టాలో రీల్స్ పోస్ట్ చేసినందుకు, స్వేచ్ఛగా అభిప్రాయాలను పంచుకున్నందుకు, ఆన్‌లైన్లో కెరియర్‌ని ప్రారంభించినందుకు అపరిచితుల నుండి కాదు, ఇంట్లోని వ్యక్తుల నుండే ద్వేషాన్ని చూస్తున్నారు.



2021లో ఉత్తరప్రదేశ్‌లో 17 ఏళ్ల నేహా పాశ్వాన్‌ని ఆమె తాత, నానమ్మ, ఇతర కుటుంబ సభ్యులు కలిసి అత్యంత కిరాతకంగా చంపారు. అక్కడికీ వారి కోపం చల్లారక, ఊరవతల బ్రిడ్జికి తలకిందులుగా వ్రేలాడదీశారు. ఆ పిల్లపై ఇంత ద్వేషం పెంచుకోవడానికి కారణం, జాతర సందర్భంగా తను సాంప్రదాయ దుస్తులు కాదని, జీన్స్ ప్యాంటు, టీ షర్టు ధరించడం. పశ్చిమ బెంగాల్‌లో 38 ఏళ్ల పరిమల్ బైద్య సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండడం సహించని ఆమె భర్తే తన గొంతు నులిమి చంపేశాడు. బీహార్‌లో 25 ఏళ్ల మహేశ్వరి రాయ్‌ని కూడా తన భర్త, ఇదే కారణంగా గొంతు కోసి, ఉరివేశాడు. పంజాబ్‌లో కాంచన్ కుమారి అనే ఇన్‌ఫ్లూయన్సర్‌ని హద్దులు మీరి వస్త్రధారణ చేసిందన్న కారణంగా ఓ మత నాయకుడు హత్య చేశాడు.


హర్యానాకి చెందిన 26 ఏళ్ల ఇన్‌ఫ్లూయన్సర్ ఆకాంక్ష భరద్వాజ్, తన చుట్టూ ఉన్న యువతులు ఆన్‌లైన్ కంటెంట్ సృష్టించకుండా కుటుంబాలు వారిని ఎలా ఒత్తిడి చేస్తున్నాయో ఇటీవల ఓ వీడియోలో పంచుకున్నారు. 'కంటెంట్‌ని సృష్టిస్తే ఇళ్లల్లో నుండి వారిని వెళ్లగొట్టేస్తామని బెదిరిస్తున్నారు. నా స్నేహితులు చాలామంది ఈ ఘర్షణను ఎదుర్కొనలేక సోషల్ మీడియా ఖాతాల్లో వాళ్ల కుటుంబ సభ్యులను బ్లాక్ చేస్తున్నారు' అని ఆమె ఆ వీడియోలో చెప్పింది.

మోడల్, ఇన్‌ఫ్లూయన్సర్ అయిన 25 ఏళ్ల తనుజా దివాన్, తన కెరీర్‌ను అర్థం చేసుకుని మద్దతుగా ఉన్న కుటుంబం, బయట నుండి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని తన బ్లాగ్‌లో చెప్పారు. 'ఇది వాళ్లకి కఠినమైన సమయమని, మనం ఎప్పుడూ ఇంట్లోనే మౌనంగా ఉండాలని వాళ్లంతా కోరుకుంటారు. ఆ హద్దులు దాటి బయటికి వస్తే ఏదో ఒక నెపంతో, మీ కూతురు హద్దు దాటుతోంది' లాంటి ఎన్నో మాటలు వాళ్లు పడవలసి వస్తుంది. ఇది చాలా కఠిన సమయం' అని ఆమె చాలా ఆవేదనగా చెప్పారు.

రాధిక విషయానికి వస్తే ఆమె హర్యానా మహిళల డబుల్స్ టెన్నిస్‌లో ఐదవ ర్యాంకు సాధించింది. అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొంది. 2024లో కార్వాన్ అనే ఓ రొమాంటిక్ మ్యూజిక్ వీడియోలో నటించింది. నేటి యువత ఆన్‌లైన్ మార్గంలో సాధికారత ఎంచుకుంటున్నారు. ఫోన్లు, కెమెరాలు వారి ఆశయాలను, ఆకాంక్షలను ప్రతిబింబించే సాధనాలుగా ఎంచుకుంటున్నారు. అయితే ఈ మార్గం వారిని మరింత హానికరంలోకి నెడుతోందని రాధిక ఉదంతం తేటతెల్లం చేస్తోంది.


ఇన్ని దారుణాలు జరిగినప్పుడు, కన్నబిడ్డల ప్రాణాలను కన్నవారే హరించి వేసినప్పుడు, ఆ కుటుంబాలని చాలా దగ్గరగా గమనించిన వాళ్లు అందరికంటే ముందు ఆశ్చర్యపోతున్నారు. అలా రాధికని తండ్రే హత్య చేశాడని తెలుసుకున్న ఆ కుటుంబాన్ని చాలా దగ్గరగా చూసిన వ్యక్తి ఇలా స్పందించాడు. 'రాధికని దీపక్ ఎంత అల్లారుముద్దుగా పెంచాడో నాకు తెలుసు. వాళ్లు చాలా మంచి మనుషులు. గౌరవప్రదమైన జీవనం సాగించారు. రాధికని నగరంలోనే టాప్ స్కూల్‌లో చదివించారు. టెన్నిస్‌లో శిక్షణ ఇప్పించారు. అకాడెమీ ప్రారంభించడానికి కూడా దీపక్ సాయం చేశారు. అతను ఎప్పుడైనా అసూయ, ద్వేషం కలిగివుంటే ఇందులో ఏ ఒక్కటైనా చేసి ఉండేవాడా?' అని అతను ప్రశ్నిస్తున్నాడు. రాధిక మృతదేహానికి అంత్యక్రియలు జరుగుతున్నప్పుడు అక్కడ గుమిగూడిన వారందరి మనసుల్లో ఇవే ప్రశ్నలు సమాధానాలు లేకుండా తిరుగుతున్నాయి.

'ఓజీ' సినిమా షూటింగ్ పూర్తి



పవన్ కళ్యాణ్‌తో చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న 'ఓజీ' సినిమా షూటింగ్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్ విడుదల చేశారు. సుజీత్ దర్శకత్వంలో కొంతమేరకు ఈ సినిమా తెరకెక్కింది. గతంలో మొదటి పార్టు శరవేగంగా షూటింగ్ పూర్తిచేయగా, పవన్ రాజకీయాల్లో బిజీగా ఉండటంతో మిగతా పార్ట్ వాయిదా పడింది. ఇటీవలే 'హరిహర వీరమల్లు' సినిమాను పూర్తిచేసిన పవన్ పనిలో పనిగా 'ఓజీ'ని కూడా రెగ్యులర్ షూటింగ్‌తో కంప్లీట్ చేశారు. ప్రస్తుతం హరీశ్ శంకర్ దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 25న ఈ సినిమాను విడుదల చేస్తామని మేకర్లు తాజాగా ప్రకటించారు.

ప్రతి నాయకురాలిగా టబు



విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కలయికలో కొత్త సినిమా షూటింగ్ కొనసాగుతోంది. కొన్నిరోజులుగా రెగ్యులర్ షూటింగ్ నడుస్తోంది. ఈ సినిమాలో ఓ కీలక పాత్ర కోసం టబును తీసుకున్న విషయం తెలిసిందే. ఆమె ఈ సినిమాలో నెగెటివ్ షేడ్స్‌లో కనిపించబోతోంది. కథానాయికగా సంయుక్త మీనన్ నటిస్తున్నారు. పూరి జగన్నాథ్ సినిమాల్లో విలన్ పాత్రలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఫుల్ లెంగ్త్ లేడీ విలన్ క్యారెక్టర్‌ను మాత్రం పూరీ ఎప్పుడూ డిజైన్ చేయలేదు. ఈ సినిమాలో టబు కోసం అతడు నెగెటి షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లుగా సమాచారం. ఆమె గతంలో ఇలాంటి పాత్రల్లో నటించారు.

అంధాధూన్ సినిమాలో బాగా నటించారు. మళ్లీ ఇన్నేళ్లకు ఆ స్థాయి పాత్ర, ఆమెకు పూరి జగన్నాథ్ సినిమా రూపంలో దొరికిందని చెబుతున్నారు. ఈ సినిమాకు 'బెగ్గర్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. విజయ్ సేతుపతి, సంయుక్త మీనన్ కాంబినేషన్‌లో మేజర్ టాకీ పార్ట్ పూర్తిచేయబోతున్నారు.

'వింటారా సరదాగా' టీజర్ విడుదల

అశోక్ గల్లా కథానాయకుడిగా నటించిన మూడో సినిమా 'వింటారా సరదాగా' నుంచి తాజాగా టీజర్ విడుదలైంది. ఇప్పటికే ఆయన దేవకీనందన వాసుదేవ, హీరో వంటి సినిమాల్లో నటించారు. అశోక్ గల్లా కథానాయకుడిగా రాహుల్ విజయ్, శివాత్మిక, శ్రీ గౌరీప్రియ ఇతర ప్రధాన పాత్రధారులుగా నటించారు. విభిన్న ప్రేమ కథతో కామెడీ డ్రామా తెరకెక్కనుంది. అమెరికా నేపథ్యంలో ఈ చిత్రాన్ని యువ దర్శకుడు ఉద్భవ్ తెరకెక్కించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్ట్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే హాస్యంతో పాటు హృదయాన్ని హత్తుకునే డ్రామాగా ఈ చిత్రం అలరించనుందని మేకర్లు తెలిపారు. విదేశాల్లోని విద్యార్థుల జీవితాలను ప్రతిబింబించేలా వినోదాత్మకంగా, సరికొత్తగా సినిమా టీజర్ ఉంది.



'పెద్ది'లో నా పాత్ర స్పెషల్ : శివరాజ్ కుమార్



"పెద్ది' సినిమాలో నా పాత్ర సరికొత్తగా ఉంటుంది. ఇప్పటికే నా పాత్ర ఉన్న అంశాల్లో షూటింగ్ జరిగింది. షూటింగ్ జరిగిన ఆ రెండు రోజులు చాలా సరదాగా అనిపించింది. తొలిసారి తెలుగులో మాట్లాడా. డైరెక్టర్ చాలా గుడ్ పర్సన్. నా షాట్‌ను ఆయన అభినందించారు. రామ్‌చరణ్ బిహేవియర్ వెరీ గుడ్. ఈ సినిమాలో తొలిసారిగా తెలుగులో డైలాగ్ చెప్పా. పెద్దిలో నా రోల్ చాలా స్పెషల్. బుచ్చిబాబు స్క్రిప్ట్ చాలా నచ్చింది. ఈ సినిమాలో నా పాత్ర పేరు 'గౌర్నాయుడు'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో వేగంగా జరుగుతుంది' అని కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ అన్నారు. రామ్‌చరణ్-బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తనదైన శైలిలో బ్యాట్ ఝుళిపించి పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద 'పెద్ది' సంతకం ఎలా ఉండబోతుందో చూపించాడు. తాజాగా కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా 'పెద్ది' సినిమాలో ఆయన లుక్ ఎలా ఉంటుందో మేకర్స్ రివీల్ చేశారు. వృద్ధి సినిమాస్ పతాకంపై మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వెంకట సతీశ్ కిలారు నిర్మాత. జాన్వీ కపూర్ కథానాయిక. శివరాజ్ కుమార్‌తోపాటుగా జగపతిబాబు, దివ్యేందు శర్మ వంటి నటులు ఇందులో నటిస్తున్నారు. ఎ.ఆర్.రెహమాన్ సంగీతం. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' విడుదల కానుంది.

చరిత్ర సృష్టించిన స్వైటెక్

ప్రత్యర్థికి ఒక్క పాయింట్ ఇవ్వకుండా వింబుల్డన్ టైటిల్ కైవసం



లండన్: మాజీ నంబర్ వన్ క్రీడాకారిణి, పోలండ్‌కు ఇగా స్వైటెక్ నయా చరిత్ర లిఖించింది. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ చరిత్రలో ఫైనల్లో ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా టైటిల్‌ను కైవసం చేసుకొని ఈ ఫీట్‌ను నమోదు చేసింది. 1911 తర్వాత 'డబుల్ బాగెల్' ఒక్క పాయింట్ ఇవ్వకుండా టైటిల్‌ను సాధించడం ఇదే తొలిసారి. సెంటర్ కోర్టులో శనివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో 8వ సీడ్, ఇగా స్వైటెక్ 6-0, 6-0తో 13వ సీడ్, అమెరికాకు చెందిన అనిసిమోవాను చిత్తుచేసింది. వీరిద్దరూ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి కాగా.. 23ఏళ్ల అనిసిమోవా రన్నరప్ ట్రోఫీతో సరిపుచ్చుకుంది. స్వైటెక్ ఇది 5వ గ్రాండ్‌స్లామ్ టైటిల్. స్వైటెక్‌కు రూ.35కోట్లు, రన్నరప్ అనిసిమోవాకు రూ.17.80కోట్ల ప్రైజ్ మనీ దక్కింది.

నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్..



ఆదివారం సెంటర్ కోర్టులో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జన్నిక్ సినర్, 2వ సీడ్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్‌ల మధ్య టైటిల్‌పోరు జరగనుంది. వీరిద్దరూ ఇటీవల జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ తలపడగా.. అల్కరాజ్ విజేతగా నిలిచాడు. అలాగే 2023, 2024 వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను నెగ్గిన అల్కరాజ్.. హ్యాట్రిక్‌పై గురిపెట్టగా.. తొలిసారి ఈ టైటిల్‌ను కైవసం చేసుకోవాలని సినర్ ఎదురుచూస్తున్నాడు.

రాహుల్ సెంచరీ

పంత్, జడేజా అర్ధసెంచరీలు • ఇండియా తొలి ఇన్నింగ్స్ 387ఆలౌట్



లార్డ్స్ : లార్డ్స్ టెస్ట్‌లో భారత ఓపెనర్ కెఎల్ రాహుల్ శతకంతో మెరిసాడు. లంచ్ తర్వాత ఆర్చర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి మూడంకెల స్కోర్ అందుకున్నాడు. ఈ సిరీస్‌లో అతడికిది రెండో శతకం కాగా.. ఓవరాల్‌గా టెస్టుల్లో పదో సెంచరీ. అలాగే కెఎల్ రాహుల్ లార్డ్స్ మైదానంలో సెంచరీ కొట్టడం ఇది రెండోసారి. దీంతో ఈ మైదానంలో రెండు సెంచరీలు కొట్టిన రెండో భారతీయుడిగా కెఎల్ రాహుల్ నిలిచాడు. అంతకుముందు దిలీప్ వెంగ్‌సర్కార్ మూడు సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. సెంచరీ కొట్టిన తర్వాత బషీర్ ఓవర్లో హ్యారీ బ్రూక్‌కు సులువుగా క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఓవర్‌నైట్‌స్కోర్ 3వికెట్ల నష్టానికి 145పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన భారత బ్యాటర్లు తొలుత ఆచి తూచి ఆడారు. ఈ క్రమంలోనే కెఎల్ రాహుల్ సెంచరీ రెండు పరుగుల దూరంలో ఉండగా.. రిషబ్ పంత్ అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నారు. రిషబ్ పంత్(74) ఔటయ్యాక అంపైర్లు లంచ్ విరామం ప్రకటించారు. ఆ సమయానికి భారత్ 4వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్(98) క్రీజ్‌లో ఉన్నాడు. కడపటి వార్తలందే సమయానికి భారతజట్టు 6వికెట్ల నష్టానికి 340పరుగులు చేసింది. జడేజా(52), సుందర్(5) క్రీజ్‌లో ఉన్నారు.

రిషబ్ పంత్ రనౌట్..

టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ సుదీర్ఘ ఫార్మాట్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో రాణించాడు. ఒంటి చేతి సిక్సర్లతో ఆకట్టుకునే పంత్.. లార్డ్స్ టెస్టులోనూ తన మార్క్ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే.. ఈసారి అతడు గాయం తాలుకు నొప్పిని పంటిబిగువున భరిస్తూనే అభిమానులను రంజింపజేశాడు. వ్యక్తిగత స్కోర్ 74పరుగుల వద్ద పంత్ సింగిల్ తీసే క్రమంలో రనౌటయ్యాడు. బెన్ స్టోక్స్ డైరెక్ట్ త్రోకు ఔటయ్యాడు.

స్కోర్‌బోర్డు..

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387పరుగులు

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)బ్రూక్ (బి)ఆర్చర్ 13, కెఎల్ రాహుల్ (సి)బ్రూక్ (బి)బషీర్ 100, కరణ్ నాయర్ (సి)రూట్ (బి)స్టోక్స్ 40, గిల్ (సి)జేమీ స్మిత్ (బి)వోక్స్ 16, పంత్ (రనౌట్) స్టోక్స్ 74, జడేజా (సి)స్మిత్ (బి)వోక్స్ 72, నితీశ్ కుమార్ రెడ్డి (సి)జేమీ స్మిత్ (బి)స్టోక్స్ 30, సుందర్ (సి)బ్రూక్ (బి)ఆర్చర్ 23, ఆకాశ్‌దీప్ (సి)బ్రూక్ (బి)కర్సే 7, బుమ్రా (సి)స్మిత్ (బి)వోక్స్ 0, సిరాజ్ (నాటౌట్) 0, అదనం 12. (119.2ఓవర్లలో ఆలౌట్) 387 పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/74, 3/107, 4/248, 5/254, 6/326, 7/376, 8/385, 9/387, 10/387 **బౌలింగ్:** వోక్స్ 27-5-84-3, ఆర్చర్ 23.2-6-52-2, కర్సే 24-5-88-1, స్టోక్స్ 20-4-63-2, బషీర్ 14.5-2-59-1, రూట్ 10.1-0-35-0

భారత 87వ గ్రాండ్‌మాస్టర్‌గా హరికృష్ణ

- సుదీర్ఘ నిరీక్షణకు దక్కిన ఫలితం



హైదరాబాద్: భారత 87వ గ్రాండ్‌మాస్టర్‌గా తెలుగు కుర్రాడు పెండ్యాల హరికృష్ణ నిలిచాడు. ఏడేళ్లుగా చెస్ టోర్నీల్లో పాల్గొంటున్న హరికృష్ణ.. గ్రాండ్‌మాస్టర్(జిఎం) హోదాకు చేరువై.. ఆ హోదాను పొందడంలో విఫలమవుతూ వచ్చాడు. కానీ ఫ్రాన్స్ వేదికగా జరిగిన లా ఫ్లాగ్నే అంతర్జాయ చెస్ ఫెస్టివల్‌లో మూడో, చివరి జిఎం హోదా సాధించి 87వ భారత గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచాడు. శనివారం జరిగిన చివరి రౌండ్‌లో భారత్‌కే చెందిన ఇనియన్‌తో గేమ్‌ను డ్రా చేసుకొని నాల్గోస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో గ్రాండ్‌మాస్టర్ హోదాకు సరిపోయే పాయింట్లు హరికృష్ణ ఖాతాలో జమ అయ్యాయి. అనంతరం హరికృష్ణ మాట్లాడుతూ.. ఏడేళ్లుగా తాను పడ్డ శ్రమకు ఫలితం దక్కిందని, గ్రాండ్‌మాస్టర్ హోదా పొందడానికి చాలా సమయం పట్టిందని, 2022 నుంచి తాను క్రమం తప్పకుండా టోర్నీల్లో పాల్గొంటున్నా... జిఎం నిబంధనలను అందుకోలేకపోయాయనని, తన సుదీర్ఘ నిరీక్షణకు దక్కిన ఫలితం' అని పేర్కొన్నాడు. 2023లో స్విట్జర్లాండ్‌లో జరిగిన బీల్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్‌లో తొలి జిఎం నార్మ్ సాధించిన హరికృష్ణ.. జూన్‌లో స్పెయిన్ లో జరిగిన లిన్స్ అందుజర్ చెస్ ఓపెన్‌లో రెండో నార్మ్‌ను పొందాడు. ఈ క్రమంలో జిఎం నార్మ్‌మ పొందడానికి 1.5పాయింట్లు అవసరం కాగా.. ప్రస్తుత టోర్నీలో రాణించి ఆ పాయింట్లను సాధించి మూడో నార్మ్‌ను సాధించి గ్రాండ్‌మాస్టర్ హోదా పొందాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68